# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 232 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 12 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 232 12-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## దుర్గగుడి చీరల వేలంలో రికార్డు..

ఏకంగా రూ. 8.15 కోట్లకు టెండర్ ఖరారు



వివరాలు 3లో..

### భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే

# అలా చేయండి..

- నరేంద్ర మోదీ పిలుపు
- ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలన్న ప్రధాని
- దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులది ముఖ్య పాత్ర అని వ్యాఖ్య
- ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన వద్ద పండించాలన్న మోదీ



న్యూఢిల్లీ అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికంగా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన దేశంలో పండించాలని

- తరువాయి 2లో..

# మంత్రులపై సిఎం అసహనం?

## చేసినవి కూడా చెప్పడం లేదంటూ అసంతృప్తి



అమరావతి అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మంత్రులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన విడిగా సహచర మంత్రులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనేక అంశాలను సిఎం ప్రస్తావించారు. ఆ సమయంలోనే మంత్రుల పని తీరుపై కూడా ఆయన మాట్లాడినట్లు తెలిసింది. శాఖలను, ప్రభుత్వాన్ని నడపాల్సింది మంత్రులే అని అధికారులు కాదని సిఎం అన్నట్లు సమాచారం. మంత్రుల పనితీరు సక్రమంగా లేదని, పనితీరులో మరింత వేగం పెంచాలని స్పష్టం చేశారు. అధికారులు మంత్రులకు కార్యక్రమాలపై చెబుతుంటారని, అయితే వాటిని పర్యవేక్షించాల్సింది మంత్రులు మాత్రమేనని ఆయన అన్నట్లు తెలిసింది. అధికారులు సక్రమంగా పనిచేయకపోతే వారిని మందలించి, పనిచేయించాల్సిన బాధ్యత కూడా మంత్రులదేనని ఆయన అన్నారు. ఆర్థికంగా ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అనేక పనులు చేసిందని, అయితే, వాటిని ప్రజలకు వివరించడంలోనూ మంత్రులు విఫలమవుతున్నారని సిఎం అన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా విద్యుత్ చార్జీలకు సంబంధించి ట్రూ డౌన్ అంశాన్ని ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. దీనివల్ల 980 కోట్ల వరకు మేలు జరిగిందని, దీనిని కూడా మంత్రులు ప్రజలకు చెప్పలేదని సిఎం అన్నట్లు సమాచారం.

**ఇక రుర్బన్ పంచాయితీలు**

రాష్ట్రంలోని పంచాయితీలను పట్టణ ప్రాంతాల్లో కలుపుతూ రుర్బన్ పంచాయితీలుగా మార్పు చేసే అంశాన్ని పరిశీలించాలని కూడా మంత్రులకు సిఎం సూచించినట్లు తెలిసింది. దీనివల్ల అభివృద్ధి వేగవంతం

- తరువాయి 2లో..

### దక్షిణ కోస్తాంధ్రపై

# ఉపరితల ఆవర్తనం...

## ఐదు జిల్లాలకు అలర్ట్

- నేడు పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు
- ఐదు జిల్లాలకు పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరిక
- మిగతా ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన



అమరావతి అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం (అక్టోబర్ 12) రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, రేపు అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి

- తరువాయి 2లో..

### నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌లో

# స్మార్ట్ స్ట్రీట్...

- వర్చువల్ గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- డ్వాక్రా మహిళలే యజమానులు...
- నెల్లూరులో అందుబాటులోకి స్మార్ట్ స్ట్రీట్
- 30 కంటైనర్లలో 120 దుకాణాలు
- 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' పథకం కింద కేటాయింపు
- సోలార్ విద్యుత్, ఫ్రీ వైఫై, సీసీ కెమెరాల వంటి ఆధునిక సౌకర్యాలు





అమరావతి అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలోని ఇతర నగరాలకూ ఈ నమూనాను విస్తరిస్తామన్న మంత్రి నారాయణ డ్వాక్రా సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెల్లూరు నగరంలో ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మైపాడు గేట్ సెంటర్ వద్ద అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన 'స్మార్ట్ స్ట్రీట్'ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా 30 ప్రత్యేక కంటైనర్లను ఉపయోగించి మొత్తం 120 దుకాణాలను ఏర్పాటు చేశారు. 'ఒక కుటుంబం -

- తరువాయి 2లో..

### పకడ్బందీ ప్రణాళికతో తీర ప్రాంత

# కాలుష్య నియంత్రణకు చర్యలు

- ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులపై అధ్యయనం చేయండి
- పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ ప్రక్రియలో పర్యవేక్షణలో పారదర్శకత వ్యవహరించాలి
- 100 రోజుల ప్రణాళికతో మత్స్యకారుల సమస్యలకు పరిష్కార మార్గాల అన్వేషణ
- కాకినాడ జిల్లాలో తీసుకోబోయే కాలుష్య నియంత్రణ చర్యలు దేశానికి మోడల్ కావాలి
- వ్యర్థాల శుద్ధి ప్రక్రియలో అధునాతన సాంకేతికతను పరిశ్రమలు వినియోగించాలి
- కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరతపై గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చిస్తాం
- పారిశ్రామిక వర్గాలు కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలి
- కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్ష సమావేశంలో దిశానిర్దేశం చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



పిఠాపురం అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంతంతో పాటు కాకినాడ జిల్లా పరిధిలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, నివారణకు అనుసరించాల్సిన ప్రణాళికల విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. ఇటీవల ఉప్పాడ తీర ప్రాంతంలో మత్స్యకారులు ఆందోళన చెందుతున్న క్రమంలో అక్కడి పరిస్థితులపై తక్షణం అధ్యయనం చేపట్టి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమస్య ఉన్న పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలని కోరారు. అందుకోసం అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేసే 100 రోజుల ప్రణాళికను తక్షణం అమలు చేయాలని సూచించారు. కాకినాడ జిల్లా పరిధిలోని తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు తీసుకోబోయే చర్యలు ఒక మోడల్ గా దేశం మొత్తం పాటించే విధంగా ఉండాలన్నారు. శనివారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో తీర ప్రాంత కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కూలంకషంగా సమీక్ష

- తరువాయి 2లో..

### ఇండిగో విమానానికి త్రుటిలో

# తప్పిన పెను ప్రమాదం

- గాల్లో ఉండగానే విమానం ముందు అద్దానికి పగుళ్లు
- మధురై నుంచి ముంబై వెళ్తున్న ఇండిగో విమానంలో ఘటన
- ల్యాండింగ్‌కు ముందు గుర్తించిన పైలట్.. ఏటీసీకి సమాచారం
- విమానంలో 76 మంది ప్రయాణికులు, సిబ్బంది
- పైలట్ అప్రమత్తతతో ముంబైలో సురక్షితంగా ల్యాండింగ్





అమరావతి అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. 76 మంది ప్రయాణికులతో వెళుతున్న విమానం ముందు వైపు అద్దానికి (విండ్‌షీల్డ్) పగుళ్లు ఏర్పడ్డాయి. అయితే, పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా కిందకు దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన శనివారం ముంబై విమానాశ్రయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మధురై నుంచి 76 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం ముంబైకి బయలుదేరింది. విమానం ముంబై విమానాశ్రయంలో ల్యాండ్ అవడానికి కొద్దిసేపటి ముందు, కాక్‌పిట్‌లోని ముందు అద్దానికి పగుళ్లు రావడాన్ని పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఈ విషయాన్ని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు

- తరువాయి 2లో..

# నేడు విశాఖలో మంత్రి నారా లోకేశ్ పర్యటన..

- ఏపీలో మొట్టమొదటి ఏఐ డేటా సెంటర్ కు శంకుస్థాపన
- డేటా సెంటర్ల హబ్ గా విశాఖ
- సిఫీ సంస్థ రూ.1500 కోట్ల భారీ పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు
- ఏఐ ఆధారిత డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్
- గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా మారనున్న విశాఖ



అమరావతి అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం నాడు విశాఖ నగరంలో పర్యటించి, రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఎడ్జ్ డేటా

- తరువాయి 2లో..



### పుస్తకాలు నన్ను ఎంతగానో

# ప్రభావితం చేశాయి..

- లక్ష్మీ పురి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన పవన్
- పుస్తకాలు చదవడం వల్లే మానసిక పరిపక్వత వస్తుందన్న పవన్
- పవన్ కల్యాణ్ తన అభిమాన నాయకుడని చెప్పిన మంత్రి సత్యకుమార్



అమరావతి అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పుస్తకాలు చదవడం ద్వారానే మానసిక పరిపక్వత సాధ్యమవుతుందని, తన జీవితంపై పుస్తకాల ప్రభావం ఎంతో ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏ విషయంలోనైనా సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని, తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' అనే పుస్తకాన్ని

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# స్వర్ణ పిపాస

'బంగారు బొమ్మ రావేమే.. పందిట్లో పెండ్లి జరిగేనే' అని పాత సినిమాలో ఒక పాట. అందమైన ఆడపిల్లలను బంగారుబొమ్మలా ఉందని చెబుతాం. ఒక్కరూపం వర్ణించటానికే కాదు, మంచి మనసున్న వారినీ బంగారంలాంటి మనసున్నోడు అనీ అంటాం. అంతేకాదు విలువైన సంబంధాలనూ బంగారంతోనే పోలుస్తాం. రూపంలో మెరిసేది బంగారమే, దాని విలువలోనూ మెరిసేది బంగారమే. అంటే ఇక మనిషిని కానీ, స్థితిని కానీ, విలువని కానీ ఉన్నతమైనదిగా చెప్పాలన్నపుడు బంగారమే ఉపమానంగా గుర్తుకువస్తుంది. ప్రపంచంలో అందరికీ సంపద రూపంగా కూడా ఉన్నది బంగారమే. అన్నిటికన్నా స్థిరమైన ఆస్తి రూపమూ బంగారం. ఇది డబ్బుకు పర్యాయపదం. పూర్వం రాజుల కాలంలో బంగారు నాణాలే నేటి కరెన్సీలా వాడుకలో ఉండేవి. ఇలాంటి బంగారం కథ చాలా ఏండ్ల క్రితందే. ఇప్పుడు బంగారం మరింత ధగధగ మెరిసిపోతున్నది. దాని మెరుపులకు సామాన్యులు దాని దగ్గరకే పోలేకపోతున్నారు. మార్కెట్‌లో బంగారం ధర చుక్కలను దాటిపోయింది. పది గ్రాములు ఒక లక్షా ముప్పయి వేల రూపాయలకు ఎగబాకింది. దాని విలువను మరింత పెంచుకుంది. ఇది దాని నిజమైన విలువనా! లేక వ్యాపార మాయజాలపు పర్యవసానమా అనేది ఆర్థిక నిపుణులు తేల్చాలి.

ప్రపంచంలో అంతటికన్నా భారతీయులకు బంగారం అంటే తెగమోజు. సంపదకు, ఆస్తి పరత్వానికి చిహ్నంగా ప్రదర్శించడం గమనించవచ్చు. బంగారం లేకుండా పెండ్లి జరగటాన్ని ఇక్కడ మనం ఊహించలేము. బంగారాన్ని అలంకరణగా ఎక్కువగా వాడేది మహిళలే. ఇప్పుడు పురుషులు కూడా వాడుతున్నారు. అతి సామాన్యుల పెండ్లిలో కూడా, కనీసం తాళిబొట్టుకైనా బంగారం కావాల్సిందే. పెండ్లి మాత్రమే కాదు. ఆఖరుకు చనిపోయాక నోట్లో ఇంత బంగారం పెట్టే దహనం చేస్తారు. స్వర్ణం మీద మోహం సామాన్యమైనది కాదు. అందుకే, 'కీర్తి, కాంత, కనకం' వీటిపై మోహంతోనే యుద్ధాలు, రాజ్యాలు, కూలిపోవడాలు, మరణించడాలు అని వ్యవహారంలో అంటూ ఉంటారు. కనకమంటే ఇక్కడ డబ్బే. పదిహేడవ శతాబ్దాపు వేమన కూడా%ౌ% 'కులము గల్గువాడు, గోత్రంబు కలవాడు, విద్యచేత విర్రవీగువాడు, పసిడిగలుగు వాని బానిస కొడుకులు' అని అన్నాడు. పసిడి ఏదయినా చేయగలదని దానర్థం. ఇక్కడా పసిడి అంటే ధనమే. పసిడి అందరినీ ఆకర్షిస్తుంది. దేవుళ్లను కూడా వదిలిపెట్టలేదు. హిందూ దేవతలను చూస్తే, అందరూ స్వర్ణకాంతులతో మెరుస్తుంటారు. ఒంటినిండా నగలే ఉంటాయి. పురుషదేవతలూ సమృద్ధిగా స్వర్ణాలంకారాలతోనే దర్శనమిస్తారు. ఇక సంపదలు, ధనం సమకూర్చి పెట్టేందుకు ఒక ప్రత్యేక దేవతయే కలదు. రామాయణ కథలో వనవాసం చేస్తున్నప్పుడు, పర్ణశాల పరిసరాల్లో సీతకు బంగారు వర్ణంలో మెరిసిపోతున్న లేడిని చూసి, ఎంత అందంగా ఉందో అని, అది కావాలని రామున్ని కోరింది. ఆ కోర్కెనే రామునితో ఎడబాటుకు కారణమైంది. పసిడి వర్ణంపై మక్కువ అలాంటిది. 'పట్టిందల్లా బంగారం' కావాలని కోరుకోవడం ఎప్పుడో గ్రీకు పురాణాల కాలం నుండి ఉందని తెలుస్తుంది. కథలూ కనిపిస్తాయి. అయితే పన్నెండవ శతాబ్దం నుండి ఉన్న సామెత. షెక్స్‌పియర్ -మార్చెంట్ ఆఫ్ వెన్నిస్‌లో వాడిన వాక్యం 'మెరిసేదంతా బంగారం కాదు' అని. అంటే మెరుస్తున్నట్టు కనపడేది, విలువైనదిగా అనిపించేది ప్రతిదీ బంగారం కాదని చెప్పడం. ఈ సామెత అన్నిటికీ వర్తిస్తుంది. ఇప్పటి రాజకీయాలకు మరీను. చాలామంది పైపై మెరుపులు మాటలు చూసి, విలువైన వారనీ, మంచివాడనీ మోసపోతుంటాం. బంగారమైతే గీటురాయిపై గీసి,అందులో స్వచ్ఛమెంతో చెప్పేయొచ్చు.

కానీ మనుషులు, రాజకీయ నాయకుల గురించి తెలియాలంటే చాలా సమయం పడుతుంది. అప్పుడే హెచ్చరించాడు బద్దెన%ౌ%'కనకపు సింహాసనమున, శునకమును కూర్చుండబెట్టి శుభలగమునన్, దొనరగ పట్టముగట్టిన, వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ' అనీ. కనకపు సింహాసనమంటే, ఇపుడు మన దేశానికి నాయకులుగా ఎవరినైతే ఎన్నుకుంటామో, వాళ్లు దేశంలోని సంపదను కాపాడే వారేనా? కాదా? సమర్థులా, కాదా! అని తెలుసుకోవాలి. బంగారం అసలైనదో కాదో తెలుసుకోలేకపోతే కొంతమాత్రమే నష్టపోతాం. కానీ దేశ సింహాసనంపై కూర్చోబెట్టే వాళ్లు కల్తీ అయితే దేశ సౌభాగ్యాన్నే కోల్పోతాం. అదలా ఉంచితే, బంగారం ఎంత స్వచ్ఛమైనదో తెలపటానికి మాత్రం మార్కెట్‌లో హాల్‌మార్క్ ఉంది.

కేడిఎం అంటున్నారు. వీటిల్లో కూడా 92 శాతమే అసలైన బంగారం. కొనేటప్పుడు అంతా బంగారమే, అమ్మేటప్పుడే మారిపోతుంటది. ఇంతకుముందు వినలేదు కానీ ఈ మధ్య బంగారం కొనేదానికి కూడా ఒక తిథిని ఏర్పాటు చేశారు. అదే అక్షర తృతీయ రోజు బంగారం కొంటే ఇక భాగ్యమే భాగ్యమని ప్రచారం పెంచేశారు. బంగారమంటే ప్రేమ సామాన్య ప్రజలకే కాదు, కవులకు, పండితులకు కూడా వల్లమాలిన ప్రేమ. రాజుల కాలంలో అయితే కనకాభిషేకాలు చేయించుకునేవారు. స్వర్ణ కంకణాలు తొడిగేవారు. గండపెండేరాలు తొడిగి వారి పాండిత్యాన్ని గుర్తించేవారు. ఇప్పుడది లేదనుకో. బంగారం చేరితే, ధరిస్తే మనిషికి విలువ పెరుగుతుందని అనుకుంటారు. ఎంత బంగారం ఉన్నా మనిషంత, మంచి మనసంత ఏదీ తూగలేదు. బంగారం లాంటి మనిషి ఉండొచ్చు, కానీ మనిషిలాంటి బంగారం ఉండదు.

## భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే అలా చేయండి..

ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే, తమ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని ఆయన తెలిపారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని మోదీ అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటినీ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు వేయించలేదని, అలాంటి ప్రాంతాలను తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందని అన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని, పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.

## మంత్రులపై సిఎం అసహనం?

అవుతుందన్నారు. అలాగే పారిశుధ్య కార్మికుల పోస్టుల పేర్లను కూడా మార్చేందుకు ఆలోచన చేయాలని సూచించారు. విశాఖపట్నాన్ని రానున్న కాలంలో మంబయి స్థాయి నగరంగా మార్చనున్నామని చెప్పారు. ఇప్పటి 5 విశాఖలో గూగుల్, రైల్వేజోన్లు వచ్చాయని, విశాఖ ఉక్కు మూతపడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వీటితో 2028 నాటికి విశాఖలో ఐటి రంగంలో లక్షలాది ఉద్యోగాలు రానున్నాయని, ఆ సమయానికి విశాఖ మరో ముంబాయి స్థాయికి చేరుకుంటుందన్నారు. ప్రస తం రాష్ట్రంలో వర్క్ ఫ్రేమ్ హెరీంలో పనిచేస్తున్న వారు 4.7 లక్షల మంది వరకు ఉన్నారని, ఈ సంఖ్యను 10 లక్షలకు పెంచాలని నిర్దేశించారు.

**కులం, మతం పేరుతో చిచ్చు: లోకేష్**

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు కుల, మత చిచ్చులు రేపేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి లోకేష్ అన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి నివాసంలో మంత్రులతో నిర్వహించి బ్రేక్ఫాస్ట్ సమావేశంలో చిత్తూరులో అంబేద్కర్ విగ్రహాన్ని వైసిపి సర్పంచ్ దగ్ధం చేసిన అంశంపై మాట్లాడుతూ ఘటన అనంతరం కేసు పెడితే వాళ్లే ఆందోళన చేస్తున్నారని ఆక్షేపించారు. అక్కడికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించాలని హెూంమంత్రి అనితకు లోకేష్ సూచించారు. దక్షిణాఫ్రికాలోని కెమరూన్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ సోదరుల డిస్టిలరీలను అక్కడి అధికారులు సీజ్ చేసిన అంశంపై చర్చ జరిగింది. దీనిని కూడా జనంలోకి తీసుకువెళ్లాలని లోకేష్ సూచించారు.

## దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం...

జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడవచ్చని అధికారులు అంచనా వేశారు. వర్షాల సమయంలో ఉరుములు, మెరుపులు ఆకస్మికంగా సంభవించే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని హెచ్చరించారు. ఇప్పటికే ఈ ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షపాతం నమోదైందని సంస్థ వివరించింది. గడిచిన 24 గంటల్లో చిత్తూరులో 34.2 మిల్లీమీటర్లు, తూర్పు గోదావరి జిల్లా లక్ష్మీపురంలో 31 మిల్లీమీటర్లు, శ్రీకాకుళం జిల్లా కోర్లాంలో 26.7 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయినట్లు తెలిపింది.

## నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌లో స్మార్ట్ స్ట్రీట్...

ఒక పారిశ్రామికవేత్త' పథకం కింద ఈ దుకాణాలన్నింటినీ పూర్తిగా డ్వాక్రా సంఘాల మహిళలకే కేటాయించారు. వీటిలో ఫుడ్ స్టాల్స్, నగల దుకాణాలు సహా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, లబ్ధిదారులైన మహిళలతో వీడియో లింక్ ద్వారా నేరుగా మాట్లాడి వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఇలాంటి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఈ స్మార్ట్ స్ట్రీట్ అనేక ప్రత్యేకతలతో రూపుదిద్దుకుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడ పూర్తిగా సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తారని, వినియోగదారుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కూడా ఉంటుందని వివరించారు. భద్రత కోసం సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరులో విజయవంతమైన ఈ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రంలోని మిగతా నగరాల్లోనూ ఇలాంటి స్మార్ట్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## పకడ్బందీ ప్రణాళికతో తీర ప్రాంత కాలుష్య నియంత్రణకు చర్యలు

సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కాకినాడ జిల్లా యంత్రాంగం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరత, కాకినాడలో మత్స్యకారులతో జరిగిన 'మాట.. మంతి' కార్యక్రమంలో మత్స్యకారులు ప్రస్తావించిన సమస్యలు తదితర అంశాలు ఈ సమీక్షలో చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ.. "రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. కొత్త కొత్త పరిశ్రమలు రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో భాగస్వామ్యమవుతున్నాయి. అయితే పెరుగుతున్న పరిశ్రమలతోపాటు ప్రజల్లో ఆందోళనలు, సందేహాలు చోటు చేసుకుంటున్నాయి. 2ముఖ్యంగా తీర ప్రాంతాల వెంబడి ఉన్న పరిశ్రమల నుంచి వెలువడే రసాయిన వ్యర్థాలు తమ జీవనోపాధిని దెబ్బ తీస్తుందన్న ఆందోళనలు మత్స్యకారుల్లో ఉన్నాయి. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆందోళన చేయడానికి అదే ప్రధాన కారణం. కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన మాటా.. మంతి కార్యక్రమంలో రసాయన వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలిపేయడం కారణంగా వారు ఇబ్బందులుపడుతున్నామని చెప్పారు. మత్స్యకారుల్లో సందేహాలు నెలకొన్న క్రమంలో వారి సూచనల మేరకు తక్షణం ఆయా పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలి. ఆ పరిశ్రమలు ఏ మేరకు కాలుష్యాన్ని సముద్రంలో కలుపుతున్నాయి, జల వాయు కాలుష్యం ఎంత అనే అంశాలపై అధ్యయనం చేపట్టి సమగ్ర నివేదిక రూపొందించాలి. పరిశ్రమలు సముద్రంలోకి విడుదల చేసే వ్యర్థ జలాలపై పర్యవేక్షణ విషయంలో పారదర్శకతతో వ్యవహరించాలి. పర్యవేక్షణ బృందాల్లో విద్యావంతులైన స్థానిక మత్స్యకారులకు అవకాశం కల్పించాలి. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, కాలుష్య నియంత్ర తదితర అంశాలపై 100 రోజుల ప్రణాళికను అమలు చేయాలి. అందులో భాగంగా కాలుష్య కారక పరిశ్రమల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి. కాలుష్య నియంత్రణ పద్దతులలో, ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఆధునీకరించి, నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంపై పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలి. ఎప్పటికప్పుడు పొల్యూషన్ ఆడిట్ నిర్వహించి ఏదైనా సమస్య గుర్తిస్తే దాన్ని సరి చేసుకునే విధంగా ఆయా కంపెనీలను ఆదేశించాలి. ఇందుకు సంబంధించి పీసీబీ, ఇతర స్టేక్ హోల్డర్స్ తో కలసి 100 రోజుల్లో పూర్తి స్థాయి రోడ్ మ్యాప్ సిద్ధం చేయాల"ని సూచించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సిబ్బంది కొరత సమస్యను శ్రీ పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పీసీబీలో సిబ్బంది లేరని, పక్క రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో చాలా తక్కువ సంఖ్యలో సిబ్బంది ఉన్నట్టు తెలిపారు. ఉప ముఖ్యమంత్రివర్యులు స్పందిస్తూ 'అవసరాలకు అనుగణంగా సిబ్బంది నియామకం చేపట్టే అంశంపై గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారితో చర్చిస్తాం. ప్రస్తుతం ఉన్న సిబ్బందిని సమర్థంగా వినియోగించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించుకుని పరిశ్రమల్లో కాలుష్య తీవ్రత నిర్ధారించడం, నివారించడంపై దృష్టి సారించాలి. అలాగే పారిశ్రామిక వర్గాలు కూడా కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలి. అభివృద్ధి చెందిన దేశాలు%-% రసాయన వ్యర్థాల నిర్వహణలో, గాలిలో కలిసే కాలుష్య కారకాల విషయంలో సరికొత్త విధానాలను అమలు చేస్తూ కాలుష్యాన్ని తగ్గించుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వర్గాలు కూడా ఈ అంశం మీద దృష్టి సారించాలి. శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకోవాలి. అందుకోసం అవసరం అయితే పర్యావరణ ప్రేమికులు, పర్యావరణవేత్తలను ఆహ్వానించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాల'న్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా.కృష్ణయ్య, మెంబర్ సెక్రటరీ శ్రీ ఎస్.శరవణన్, సీనియర్ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాకినాడ జిల్లా కలెక్టర్ శ్రీ షణ్మోహన్ సగిలి, ఎస్పీ శ్రీ బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.ంం

## ఇండిగో విమానానికి త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

తెలియజేశారు. పైలట్ నుంచి సమాచారం అందుకున్న విమానాశ్రయ అధికారులు వెంటనే అప్రమత్తమై అన్ని రకాల అత్యవసర ఏర్పాట్లు చేశారు. విమానం ఎలాంటి ఆటంకాలు లేకుండా ముంబై విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం విమానాన్ని ప్రత్యేకంగా బే నంబర్ 95 వద్దకు తరలించి, ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. ప్రస్తుతం విమానం అద్దాన్ని మార్చేందుకు సాంకేతిక సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటన కారణంగా ముంబై నుంచి మధురైకి వెళ్లాల్సిన తిరుగు ప్రయాణాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, విమానం అద్దం ఎందుకు పగిలిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై ఇండిగో సంస్థ ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి..

కళాక్షేత్రంలో పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఒక పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటాం. ఏదైనా సాధించాలంటే పట్టుదల చాలా అవసరం. ఈ పుస్తకంలోని మాలతి పాత్ర నాకు ఎంతగానో స్ఫూర్తినిచ్చింది. ఆ పాత్రలో ధైర్యసాహసాలు, మేధస్సు, స్వాతంత్ర్య కాలం నాటి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కనిపిస్తాయి" అని వివరించారు. తన తల్లి వంట గది నుంచే ప్రపంచాన్ని చూశారని గుర్తుచేసుకున్నారు. భారతీయ ఆలోచనా విధానం నుంచే తాను వచ్చానని, మన దేశంలో స్త్రీకి అత్యున్నత గౌరవం ఉందని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ మహిళా విభాగానికి 'ఝాన్సీ వీర మహిళ' అని పేరు పెట్టినట్లు గుర్తుచేశారు. ఇదే వేదికపై పవన్ కల్యాణ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను త్వరలోనే అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ నా అభిమాన నాయకుడు. నేను ఈ రోజు మంత్రిగా కాకుండా సాధారణ వ్యక్తిగా వచ్చి ఉంటే, మీ అందరితో కలిసి కింద కూర్చుని 'పవర్ స్టార్', 'ఓజీ' అని గట్టిగా అరిచేవాడిని" అని తన అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## నేడు విశాఖలో మంత్రి నారా లోకేశ్ పర్యటన..

సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం విశాఖ భవిష్యత్ ప్రగతికి నాంది పలకనుందని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి. విశాఖ డేటా సెంటర్ల హబ్ గా రూపుదిద్దుకోనుంది. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి నారా లోకేశ్... ఈ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 12వ తేదీన విశాఖలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జూా%) కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాక వల్ల భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతో పాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది. రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధిలో భాగంగా నారా లోకేశ్... నాస్ డాక్ లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్(%వాఱటఎ ×అటఱఅఱ్ రాజూఞవం రాఱఎ్‌వం%) నిర్మించబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను సిఫీ అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జూా%) సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తూ.. ఎడ్జ్ స్థాయిలో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించే అవకాశం కల్పిస్తుంది. భారతదేశంతో పాటు ఆగ్నేయాసియాలోని సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, థాయ్ లాండ్ వంటి దేశాల మధ్య త్వరితగతిన డేటా ప్రాసెసింగ్ చేస్తూ విశాఖ సీఎల్ఎస్ వ్యూహాత్మక ల్యాండింగ్ పాయింట్ గా పనిచేస్తుంది.

## ప్రజాస్వామ్యాన్ని బలపరుచుకోవాలి : పల్లంరాజు




**కాకినాడ, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

: ప్రజాస్వామ్యాన్ని బలపరుచుకోవాలని మాజీ కేంద్ర మంత్రి, సి డబ్ల్యు సి సభ్యులు ఎం ఎం పల్లంరాజు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా శనివారం జగ్గంపేటలో 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిటీలో సుప్రీం కోర్టు జడ్జికి బదులు వారి కేంద్ర మంత్రిని నియమించుకునే విధంగా చట్టం చేశారన్నారు. దాంతో ఎన్నికల కమిషనర్ ను వారికి తొత్తుగా వ్యవహరించే వారిని నియమించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన ఎన్నికల్లో 1.50 ఓట్లను అదనంగా చేర్చిందనే విషయాన్ని రాహుల్ గాంధీ ఆధారాలతో రుజువు చేశారన్నారు. అయినా ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడంతో ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. 3 కోట్ల మంది సంతకాలు సేకరించే ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సెంటర్లోని ప్రజల నుండి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి జిల్లా సెక్రటరీ మల్లిపూడి రాంబాబు, జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మొయ్యేటి సూర్యప్రకాశ్, జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ మారోతి శివ గణేష్, గొల్లప్రోలు మండల అధ్యక్షులు మొగిలి సురేష్, సీనియర్ పార్టీ నాయకులు ఎస్ వి ఎస్ బాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## హేలాపురి ఉత్సవం అర్థవంతంగా నిర్వహించాలి

**షాపింగ్ ఫెస్టివల్ లో పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేయాలి**

**అధిక మొత్తంలో కొనుగోలు చేసిన ముగ్గురికి బహుమతులు**

**ఉత్సాహ పరిచే సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించాలి**

**వాలాపురి ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**ఏలూరు, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



సూపర్ జిఎస్టి... సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 13వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఏలూరు సర్. సి. ఆర్. రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్ లో నిర్వహించనున్న నిర్వహించనున్న హేలాపురి ఉత్సవం ప్రజలకు ఉపయోగపడేలా అర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సెల్వి అధికారులను ఆదేశించారు. హేలాపురి ఉత్సవం ఏర్పాట్లపై శనివారం సాయంత్రం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిఎస్టి ఫలాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు షాపింగ్ ఫెస్టివల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. షాపింగ్ ఉత్సవంలో పెద్ద ఎత్తున స్టాల్స్ ను ఏర్పాటు చేసేలా వర్తకులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను మరింత ఉత్సాహపరిచేందుకు హేలాపురి ఉత్సవం సమయంలో అధిక మొత్తంలో షాపింగ్ చేసిన వారి పేర్లను ఉత్సవం చివరి రోజున డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందజేయాలన్నారు. హేలాపురి ఉత్సవ ఆవరణలో ఫుడ్ కోర్ట్ లు వంటివి ఏర్పాటుచేయాలనీ, చిన్న పిల్లలను ఉత్సాహపరిచే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేలా హేలాపురి ఉత్సవాలు నిర్వహించాలని, వర్షం వస్తే ప్రజలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. జిల్లా అధికారులు అందరూ వారి కుటుంబ సభ్యులతో జిల్లా అధికారులు అందరూ వారి కుటుంబ సభ్యులతో హేలాపురి ఉత్సవాలలో పాల్గొనాలని చెప్పారు. హేలాపురి ఉత్సవం ఆవరణలో పటిష్టమైన భద్రతా చర్యలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, వాణిజ్య పనులు శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జున రావు, ఆర్డిఓ అచ్యుత్ అంబరీష్, ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ ఏ భాను ప్రతాప్, వివి జిల్లా సమాచారం సేక ఏలూరు జిల్లాధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
అక్టోబర్ 12,
ఆదివారం 2025



విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి

## విజ్ఞాన ప్రదర్శనలు దోహదం

సృజనాత్మకతకు వేదికలు కావాలి - కొత్తపేట ఎమ్మెల్యే బండారు





**రావులపాలెం, అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం )**

విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపుదలకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం ఆయన రావులపాలెం సెయింట్ ప్యాట్రిక్ పాఠశాలలో విద్యార్థులచే ఏర్పాటు చేసిన ఆర్ట్స్, సైన్స్, సోషల్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఇలాంటి ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తాయి. పుస్తకాలలో చదివిన విషయాలను ప్రాక్టికల్‌గా చూపించడానికి, తమ ఆలోచనలను రూపకల్పన చేయడానికి ఇవి ఉత్తమ వేదికలు" అని అన్నారు. ఒకే ప్రదర్శనలో విభిన్న అంశాలను ప్రదర్శించడం ప్రేరణాత్మకమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ మోడల్స్, పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన క్రాఫ్ట్ వర్క్స్, సామాజిక అంశాలపై ప్రాజెక్టులను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక విద్యార్థుల సృజనాత్మకత, కృషిని ప్రశంసించారు. "చిన్నారుల ఆలోచనలు వినూత్నంగా ఉన్నాయి. విజ్ఞానం, ఆవిష్కరణల పట్ల మీ ఆసక్తి భవిష్యత్తులో మిమ్మల్ని విజయవంతులుగా తీర్చిదిద్దుతుంది" అని విద్యార్థులకు సూచించారు. విద్య అనేది కేవలం పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా, ప్రాక్టికల్ అవగాహనను కల్పించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను వివరించిన తీరు ఆయనను ఆకట్టుకుంది. "మీ మాటల్లో నమ్మకం, పనిలో చురుకుదనం కనబడుతోంది. ఇదే మీ భవిష్యత్తుకు పునాది" అని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రశంసించారు.

## భీమవరం సూపర్ జిఎస్టి బెన్ఫిట్ బజార్" ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 19 వరకు భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ నందు ఏర్పాటు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం)**

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా దసరా నుండి జిఎస్టి స్లాబులు తగ్గింపులపై ప్రచారాన్ని ప్రారంభించి కొనసాగించడం జరుగుచున్నదన్నారు. జిఎస్టి తగ్గింపుల ప్రచారాన్ని నాలుగు కేటగిరీలుగా విభజించి మూడు వారాలపాటు వివిధ వస్తువుల ప్రదర్శనలతో అవగాహన కలిగించే విధంగా ప్రచారాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 19 వరకు భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ నందు జిల్లా యంత్రాంగం చొరవతో "భీమవరం సూపర్ జీఎస్టీ బెన్ఫిట్ బజార్" ను నిర్వహించడం జరుగుతుందని, బజార్లో వివిధ వస్తువులను తగ్గింపుపై అమ్మకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు బజాజ్ తెరిచి ఉంటుందని, ప్రవేశం ఉచితం అని తెలిపారు. దీపావళికి ముందు ఈ ఉత్సవం నిర్వహించడం ద్వారా పన్ను సంస్కరణలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంతోపాటు, స్థానిక వ్యాపార భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా తోడ్పడుతుందన్నారు. వినియోగదారులకు పండుగ సీజన్ డిస్కౌంట్లు, కాంబో ఆఫర్లు, బోనాంజాలు కూపన్లు కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఇది దీపావళికి ముందు ఏర్పాటు చేయడం వలన స్థానిక వాణిజ్యం, వ్యవస్థాపకత మరియు వినియోగదారులకు లాభాలను పెంచడానికి దోహదపడుతుందన్నారు. జిల్లాలో తయారు చేయబడిన ఉత్పత్తులు, ఎం.ఎస్.ఎం.ఈ ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రదర్శించడంతోపాటు, రిటైలర్లు, తయారీదారులకు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. మేక్ ఇన్ ఇండియా మరియు వోకల్ ఫర్ లోకల్‌తో అనుసంధానించబడిన "లోకల్‌ను కొనండి - స్థానికంగా నిర్మించండి" అనే స్ఫూర్తిని ప్రోత్సహించడానికి దోహదపడుతుందన్నారు. "భీమవరం సూపర్ జీఎస్టీ బెన్ఫిట్ బజార్" నందు ఎలక్ట్రానిక్స్, ఉపకరణాలు, ఎం ఎస్ ఎం ఈ లు, స్టార్టప్ లు, హస్తకళలు, చేనేత, వస్త్రాలు, ఫ్యాషన్ వస్తువులు, గృహోపకరణాలు, పుస్తకాలు, స్టేషనరీ, వ్యవసాయ పరికరాలు, వ్యవసాయ యంత్రాలు, గృహాలంకరణ, ఫర్నిచర్, పర్యాటకం, ఆతిథ్య ప్రదర్శనలు, ఆటోమొబైల్, తదితర వస్తువులను మెగా డిస్కౌంట్ తో అమ్మకాలు జరుగుతాయన్నారు. ప్రతి సాయంత్రం సాంస్కృతిక, వినోదం కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే పిల్లల ప్లే జోన్, ఫుడ్ కోర్టులు ఏర్పాటు కూడా ఉంటుందన్నారు. అక్టోబర్ 19 గ్రాండ్ ఫినాలేగా దీపావళి దియా లైటింగ్ వేడుక, రాఫెల్ డ్రాలు, బహుమతులు, లక్కీ బొనాంజాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. "భీమవరం సూపర్ జీఎస్టీ బెన్ఫిట్ బజార్" ను అన్ని శాఖల అధికారులు, వ్యాపార ప్రతినిధులు, వినియోగదారులు విజయవంతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## కొత్తపేటలో కోనసీమ ఫ్రెష్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

వ్యాపార రంగంలోకి యువత రావడం హర్షణీయం %- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం)**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శివారు రాముడునూతిమెరకలో నూతనంగా ఏర్పాటు చేసిన కోనసీమ ఫ్రెష్ వాటర్ ప్లాంట్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక యువత వ్యాపార రంగంలోకి అడుగుపెడుతూ స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగడం హర్షణీయమని అన్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ ప్లాంట్ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. "ప్రజారోగ్యానికి మేలు చేసే వ్యాపారాలు ఎప్పుడూ నిలకడగా అభివృద్ధి చెందుతాయి. ఈ ప్లాంట్ విజయవంతంగా కొనసాగి ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలి" అని ఆకాంక్షించారు. యజమాని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రెడ్డి సుబ్రహ్మణ్యంను సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్లాంట్ యజమాని, కుటుంబ సభ్యులు తమ వ్యాపారం ద్వారా ప్రాంత ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చే కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, సీనియర్ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, జిల్లా కార్యదర్శి యాళ్లమెల్లి జగన్మోహన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, గుబ్బల మూర్తి, దునబోయిన ప్రదీప్, లంక సుబ్రహ్మణ్యం, కొప్పిశెట్టి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జనార్ధన స్వామిని దర్శించుకున్న

## అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత

అనుశ్రీ దంపతులకు ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



**ఆలమూరు, అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం )**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ఆలమూరులోని శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి దేవస్థానాన్ని జనసేన పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఇన్‌చార్జ్, అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత, ఫిలిం డిస్ట్రిబ్యూటర్ అత్తి సత్యనారాయణ (అనుశ్రీ) తన సతీమణి అనురాధదేవితో కలిసి శనివారం దర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో సభ్యులు అనుశ్రీ దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. "ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణంలో నెలకొని ఉన్న ఆలమూరు జనార్ధన స్వామి దర్శనం మాకు ఎనలేని ఆత్మసంతృప్తి ఇచ్చింది" అని అనుశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అనుశ్రీ దంపతులకు ఘన సత్కారం జరిగింది. కార్యక్రమంలో నల్లా వెంకన్న, చల్లా బాబి, వెలుగుబంటి వెంకన్న, అయినవిల్లి శ్రీనివాస్, బొబ్బా రాంబాబు, చిన్నం సుబ్బలక్ష్మి, దారా దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడి చీరల వేలంలో రికార్డు..

ఏకంగా రూ. 8.15 కోట్లకు టెండర్ ఖరారు

దుర్గమ్మ చీరల టెండర్‌తో భారీగా పెరిగిన ఆలయ ఆదాయం

ఏడాదికి రూ. 8.15 కోట్లకు టెండర్ కైవసం చేసుకున్న గుంటూరు సంస్థ

గతంతో పోలిస్తే ఏకంగా రూ. 2.50 కోట్లకు పైగా అదనపు రాబడి

పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించిన ఆలయ అధికారులు

రాబోయే రెండేళ్లపాటు చీరల సేకరణ బాధ్యత కొత్త సంస్థదే

**విజయవాడ అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించే చీరల ద్వారా ఆలయానికి వచ్చే ఆదాయం రికార్డు స్థాయిలో పెరిగింది. పూర్తి పారదర్శకంగా నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయ ఖజానాకు భారీగా రాబడి సమకూరింది. గతంతో పోలిస్తే ఏడాదికి ఏకంగా రూ. 2.50 కోట్లకు పైగా అదనపు ఆదాయం రావడం గమనార్హం. శుక్రవారం ఆలయ మహామండపంలో నిర్వహించిన చీరల సేకరణ టెండర్ల ప్రక్రియలో గుంటూరుకు చెందిన శ్రీ పావని కలెక్షన్స్ సంస్థ ఏడాదికి రూ. 8.15 కోట్లకు టెండర్‌ను దక్కించుకుంది. రాబోయే రెండేళ్లపాటు అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టు, కాటన్, సాధారణ చీరలతో పాటు జాకెట్ ముక్కలను ఈ సంస్థ సేకరించనుంది. ఈ టెండర్ ప్రక్రియలో మొత్తం మూడు సంస్థలు పోటీపడగా, శ్రీ పావని కలెక్షన్స్ అత్యధిక మొత్తానికి పాడి దక్కించుకుంది. గతంలో రెండేళ్ల కాలానికి ఓ ప్రైవేటు సంస్థకు ఏడాదికి కేవలం రూ. 5.50 కోట్ల చొప్పున మాత్రమే చీరల సేకరణ కాంట్రాక్టును అప్పగించారు. అయితే, తాజాగా నిర్వహించిన పారదర్శక వేలం పాటతో ఆలయ ఆదాయం ఒక్కసారిగా 35 శాతం పెరిగింది. ఈ వ్యూహాత్మక చర్యతో రాబోయే రెండేళ్లలో ఆలయానికి సుమారు రూ. 16.30 కోట్ల ఆదాయం సమకూరనుంది.కమిషనర్ రామచంద్రమోహన్ సూచనల మేరకు పక్కా ప్రణాళికతో, పూర్తి పారదర్శకంగా ఈ టెండర్లను నిర్వహించామని ఆలయ ఈఓ శ్రీనానాయక్ తెలిపారు. గతంలో ఈ టెండర్ల విషయంలో లాబీయింగ్ జరిగాయన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈసారి ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా బహిరంగ వేలం నిర్వహించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు అందాల్సిందే..

ఏ వర్తకులైనా పాత జీఎస్టీ వసూలు చేస్తే రాష్ట్ర స్థాయిలో 8712631279, జిల్లా స్థాయిలో 8712631283 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు

ఫిర్యాదులు నమోదుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లు , హెల్ప్ డెస్క్

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం )**



జీఎస్టీ 2. %ఉ% ప్రయోజనాలు ప్రజలందరికీ అందాల్సిందేనని, ఈ విషయంలో సహకరించని వర్తకులపై ప్రజలు చేసే ఫిర్యాదులను పరిగణనలోనికి తీసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు పెద్దఎత్తున ప్రయోజనాలు కల్పించే ఉద్దేశ్యంతో జీఎస్టీ లో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చాయని, జీఎస్టీ ఫలాలు ప్రజలందరికీ అందేలా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కానీ కొంతమంది వర్తకులు కొత్త జీఎస్టీ విధానాన్ని అమలు చేయకుండా పాత జీఎస్టీ స్లాబ్ ల ప్రకారమే వసూలు చేస్తున్నారన్న ప్రజల అభిప్రాయాలపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. జీఎస్టీ ప్రయోజనాలకు సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించాడానికి, సందేహాలను నివృత్తి చేసేందుకు ఏలూరు జిల్లాలో 8712631283 ఫోన్ నెంబర్ తో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్ లను అధికారులు ఏర్పాటు చేశారు. అంతేకాక రాష్ట్ర స్థాయిలో కూడా జీఎస్టీ ఫిర్యాదుల నమోదుపై 8712631279 ఫోన్ నెంబర్ తో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ లకు వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి, ఫిర్యాదులో అంశాలపై విచారణ చేసి సంబంధిత వర్తకులపై నిబంధలననుసరించి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రజలు తెలియజేసే సందేహాలను నివృత్తి చేయాలని వాణిజ్య శాఖ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి %-% ఆలమూరు ఎస్సై జి. నరేష్

**ఆలమూరు, అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం)**



రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు ఎస్సై జి. నరేష్ సూచించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకున్న వారు కూడా ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొరియర్ సేవల పేరుతో, చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్‌లు, హనీట్రాప్, లాటరీల పేరుతో, డెబిట్ కార్డు మోసాలు, వీడియో కాల్‌ల ద్వారా స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేసే ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో ఎస్బీఐ, రైతు భరోసా వంటి సేవా కేంద్రాల పేరుతో ఏపీకే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరుతూ వస్తున్న సందేశాలు మోసపూరితమని హెచ్చరించారు. అలా యాప్‌లు ఇన్‌స్టాల్ చేయడం వల్ల ఫోన్లు హ్యాక్ అయి, వ్యక్తిగత డేటాను దొంగిలించి నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. "స్మార్ట్‌ఫోన్లు మంచి కోసం ఉపయోగిస్తే జీవితం సాఫీగా ఉంటుంది. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలకు ఆకర్షితులై మోసపోకండి" అని ఎస్సై నరేష్ సూచించారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి సైబర్ నేరగాళ్లు ఎక్కువగా కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు సెట్ చేసుకోవడం, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయకపోవడం ద్వారా సైబర్ మోసాల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ %ఋఋ.ఎఎవతీఎతీఅఎవ.గ్రశీఙ.అఅ% లో కూడా వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు.

## రావులపాలెం మండల బీజేపీలో నూతన ఉత్సాహం

మండల అధ్యక్షుడిగా కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక



**రావులపాలెం: అక్టోబర్ 11: (తెలుగురాష్ట్రం)**

రావులపాలెం మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల ఇంచార్జ్ అధ్యక్షుడిగా కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలో జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించబడింది. సమావేశంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చికురుమిల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర సీనియర్ నాయకులు, గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి నడింపల్లి సుబ్బరాజు, మండల ప్రధాన కార్యదర్శి గిద్దా వెంకటేశ్వరరావు, పి నరసింహారాజు, చింత సత్యనారాయణ రెడ్డి, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఈశ్వర్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరావులపాలెం మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, బూత్ స్థాయిలో కార్యకర్తలను చైతన్య పరచడానికి కొత్త నాయకత్వం కృషి చేయాలని ఆకాంక్షించారు. కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎపార్టీ బలోపేతం కోసం తాను అంకితభావంతో పనిచేస్తానని, బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మండలంలో పార్టీ ప్రభావాన్ని మరింత పెంచుతానని తెలిపారు. సభలో పలువురు నాయకులు మాట్లాడారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# భరత్ సూట్ కేసులు తీసుకుని కార్మికులను మోసం చేశాడు : మజ్జి రాంబాబు



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 11(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఏపీ పేపరు మిల్లు కార్మికుల విషయంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అధికారంలో ఉన్న సమయంలో చేయరాని తప్పులన్నీ చేశాడని, అందుకే ఎన్నికల సమయంలో అతనికి తగిన గుణపాఠం చెప్పారని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు అన్నారు. మంచి అగ్రిమెంట్ చేయిస్తాను, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయిస్తానంటూ నమ్మబలికి అందినకాడికి దోచుకున్నాడని ఆరోపించారు. ఈ మేరకు రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మార్గాని భరత్ మీటింగులు పెట్టి అది చేస్తాను ఇది చేస్తానని చెప్పి పరంపర 1,2 ద్వారా అవినీతి చేశాడని ఆరోపించారు. పరంపర కార్మికులకు మాజీ ఎంపీ మార్గాని భరత్ అన్యాయం చేశాడని, ప్రవీణ్ చౌదరిని అడ్డుపెట్టుకుని కోట్ల అవినీతి చేశాడని ఆరోపించారు. మార్గాని భరత్ కు 50 లక్షలు ఇచ్చానని ప్రవీణ్ చౌదరీయే బహిర్గతం చేశాడరని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే దీనిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెబితే త్రీటౌన్ పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు కూడా చేశామని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ళు పేపరుమిల్లు కార్మికులకు భరత్ సరైన అగ్రిమెంటు చేయలేకపోయాడని, ఎందుకంటే మిల్లు యాజమాన్యం నుంచి ఐదేళ్ళపాటు సూట్ కేసులతో డబ్బు తీసుకున్నాడని ఆరోపించారు. కోవిడ్ టైంలో కూడా మార్గాని భరత్ మిల్లు నుంచి బాగా దండుకున్నాడన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరంపర కార్మికులకు న్యాయం చేశారని, అలాగే మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంటు చేయించారన్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు సూట్ కేసులు అవసరం లేదన్నారు. భరత్ మాదిరిగా చేసిన పనికి డబ్బులు తీసుకునే అలవాటు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు లేదన్నారు. పేపరు మిల్లు సీఎస్సార్ నిధులతో కోటిలింగాల పేటలో కోటీ 25 లక్షలతో పంపు హౌస్ నిర్మించేలా చేశారన్నారు. కమ్యూనిటీ హాళ్ళు కట్టిస్తున్నారని తెలిపారు. మెడికల్ క్యాంపులు కూడా త్వరలో ఏర్పాటు చేయిస్తారని తెలిపారు. చేసిన ప్రతి చిన్న పనికీ ఐదేళ్ళు మార్గాని భరత్ ఫ్లెక్సీలు కట్టాడని, మీటింగులు పెట్టాడని, మరి ఇప్పుడెందుకు పేపరుమిల్లు గేటు దగ్గరకు రాలేకపోతున్నాడని ప్రశ్నించారు. కార్మికులను మోసం చేశానన్న విషయం అతని మనసాక్షికి తెలుసన్నారు. అందరినీ ఈ విధంగానే మోసం చేశాడు కాబట్టి భరత్ ను ప్రజలు చిత్తుగా ఓడిరచి ఇంట్లో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. ప్రెస్ మీట్లు పెట్టి ఇష్టానుసారంగా వ్యక్తిగతంగా తిట్టేవాడని, తిట్టించేవాడని, కాని ఇప్పుడు తాము అలా తిడతామంటే తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తిట్టడానికి ఒప్పుకోవడం లేదన్నారు. చేసిన అభివృద్ధి చెప్పండి అని అంటున్నారని అన్నారు. భరత్ ఏమీ చెయ్యకుండానే కబుర్లు చెప్పేవాడని మండిపడ్డారు. దానికి తానే సాక్ష్యమని, సీవీ మార్కెట్ కు తాను ప్రెసిడెంటునని, ఎన్నో సందర్భాల్లో మమ్మల్ని భరత్ తనవద్దకు తిప్పుకున్నాడని, మార్కెట్ ను మూవ్ చేసేస్తానని చెప్పేవాడని, ఎమ్మెల్సీగా ఉన్న ఆదిరెడ్డి అప్పారావు చెయిద్దామనుకుంటే ప్రభుత్వం మారిపోయిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అధికారంలోకి రాగానే 15 నెలల్లో మార్కుట్ తరలింపు మార్గాన్ని సింపుల్ గా చేసేశారని తెలిపారు. ఇలా ఉండాలి నాయకుడంటే.. మాటిస్తే చేయాలి మాటకు కట్టబడి ఉండాలి అదీ నాయకుడంటే అని మజ్జి రాంబాబు అన్నారు భరత్ మమ్మల్ని అన్నిసార్లు తిప్పాడంటే మేం ఏమైనా బ్యాగ్ ఇస్తే తీసుకుందామని తిప్పాడని, కాని మేం వ్యాపారస్తులం అప్పటికే చితికిపోయిఉన్నామన్నారు. బ్యాగ్ ఇవ్వకపోవడంతో భరత్ పని చేయలేదన్నారు. ఈరోజు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రూపాయి అవినీతి లేకుండా ఫైలు క్లియర్ చేసేశారని కొనియాడారు. తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సీవీ మార్కెట్ నాలుగు ఎకరాల కార్పొరేషన్ స్థలం మిగిల్చారని అన్నారు. గతంలో భరత్, వైసీపీ వారు ప్రెస్ మీట్లు పెడితే తిట్టడానికి పెట్టేవారని, ఇప్పుడు తాము ప్రెస్ మీట్లు ప్రశ్నించడానికి చేసింది చెప్పుకోడానికి పెడుతున్నామన్నారు. పుష్కర ఘాట్ వద్ద బ్యూటిఫికేషన్ పేరుతో పేర్చిన రాళ్ళ మీద విజిలెన్స్ ఎంక్వైరీ అయిందని, ఈ రాళ్ళ విషయంలో దారుణమైన అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిలో భారీగా అవినీతి జరిగిందని రిపోర్టు వచ్చిందన్నారు. విజిలెన్స్ ఎస్పీ ఇదేపని మీద ఉన్నారన్నారు. ఇక దేవీచౌక్ లో కూడా శాంపిల్స్ తీసుకుంటున్నారని, విజిలెన్స్ ఎస్పీ దీని మీదే ఉన్నారన్నారు. ప్రాథమికంగా చాలా తప్పులు జరిగాయని వస్తోందన్నారు. అతి తొందరలో రిపోర్టువస్తుందని, తప్పుచేసినవారు సమాధానం చెప్పాల్సి వస్తుందని, దానివెనుక ఎవరు ఉన్నారో బయటకు వస్తుందన్నారు. మీడియా సమావేశంలో టీడీపీ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మొకమాటి సత్యనారాయణ, కార్యదర్శులు ద్వారా పార్వతి సుందరి, మహ్మద్ అస్లాం, నగర బీసీ విభాగం అధ్యక్షులు బుడ్డిగ రవి, పందిరి మహదేవుడు సత్రం డైరెక్టర్ సలాది ఆనంద్, నాయకులు దుత్తరపు గంగాధర్, ఈతలపాటి రవి, బొర్రా చిన్ని, కందికొండ అనంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పశువుల దానా పంపిణీ



**వి. ఆర్. పురం, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా రాజుపేట పంచాయతీలో రాజుపేట కాలనీ సీతంపేట, తోటపల్లి గ్రామాలలో వరదలకు పశువులకు మేత లేకపోవడంతో కూటమి ప్రభుత్వం ద్వారా పశుగ్రాసం శనివారం సర్పంచ్ శారద , ఎంపీటీసీ వి.భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ ముంజపు రాము చేతుల మీదుగా పశువులు ఉన్న రైతులకు 25 కేజీల పశుగ్రాసం దానా బస్తాలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం టిడిపి గ్రామ అధ్యక్షుడు పెట్టా ముత్యాలరావు, గ్రామ పెద్ద రేవు సింహాచలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని, వరదల కారణంగా పశువులకు పశుగ్రాసం తగ్గడంతో పై అధికారులకు తెలియజేయడంతో పశువుల దానాను పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు , గ్రామ పెద్దలు పెట్టా వీరభద్రరావు, నానారపు దుర్గారావు, జి. ప్రసాదు, పశువుల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మద్ది ఆంజనేయ స్వామి కార్తీక మాసోత్సవాల కరపత్రాలను శనివారం ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. శనివారం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20 వరకు కార్తీక మాసోత్సవాలు జరగనున్నాయి. కార్తీకమాస ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ధర్మకర్తల మండలి, ఆలయ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ధనుష్ యాదవ్‌ను అభినందించిన ఎమ్మెల్యే రోషన్




**చింతలపూడి, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం విలేఖరి):** తమ ప్రతిభతో దేశానికి, నియోజకవర్గానికి గౌరవం తీసుకురావడంలో మరో అడుగు వేసిన ధనుష్ యాదవ్ ప్రతిష్టాత్మక బాడీ బిల్డింగ్ టైటిల్స్ విజేతగా నిలిచారు. మిస్టర్ ఆంధ్రా, ఢిల్లీ ఇండియా - మసిల్ మేనియాగా నిలిచారు. విజేత ధనుష్ యాదవ్ ను శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ అభినందించారు. ఆయనతో పాటు పట్టణ, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందు ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. ఇంటర్నేషనల్ బాడీబిల్డింగ్ పోటీ కోసం దుబాయ్ లో భారతదేశాన్ని ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికయ్యారు. ఈ ఘనతలో భాగస్వామ్యమవ్వడం చిన్నిగోల్డ్ జిమ్ కి గర్వకారణం. చింతలపూడిలో చిన్నిగోల్డ్ జిమ్ ట్రైనర్లు ?పవన్ భవసాని, ఫిట్‌నెస్ కోచ్ సాయి కుమార్, కురకుల జిమ్ నిర్వాహకుడు, ఫిట్నెస్ కోచ్ కు అభినందనలు తెలిపారు.

## ప్రతీ బాలికకు హక్కులు, ఆరోగ్యం, భవిష్యత్తు

### -డిఎంహెచ్‌ఓ డాక్టర్ కే.వెంకటేశ్వరరావు




**రాజమహేంద్రవరం, అక్టోబర్ 11(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పట్టణంలోని ఎస్.టి. పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హై స్కూల్, ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించి, బాలికల సాధికారత, హక్కులు మరియు ఆరోగ్యంపై విలువైన సూచనలు చేశారు. “బాలిక ఒక కుటుంబానికి వెలుగు, ఒక తరం అభివృద్ధికి పునాది అన్నారు. బాలికలకి సమాజంలో సమాన అవకాశాలు కల్పించకపోవడం వలన సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు అని పేర్కొన్నారు. ప్రతి బాలికకు సమయానికి టీకాలు, పోషకాహారం, రక్తహీనత నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. మానసిక ఆరోగ్యపైన కూడా సమాన దృష్టి అవసరం అని అన్నారు. బాలికల హక్కుల పరిరక్షణకు వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖలు కలసి విస్తృత స్థాయిలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. బాలిక బలంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుంది సమాజం అభివృద్ధి చెందుతుంది అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, కంబాలపేట వైద్యాధికారి డా. ఎం. అనూహ్య, హాస్టల్ వార్డెన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షమ్మీ కుమార్, సుధీర్, సి.సి. రాజు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలి



**కూనవరం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90, ఆట, టాప్ టెన్ టీం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం న అక్టోబర్ 11నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలో భాస్కర టాకీస్ లో బీర్సా ముండా జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90, ఆదివాసి టాప్ టెన్ టీం, ఆదివాసి టీచర్స్ అసోసియేషన్, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసి హక్కులు చట్టాలపై సెమినార్ ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు కారం రవి మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ భూభాగంలో ఆదివాసి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వని కోరారు. గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముర్రం వీరభద్రం మాట్లాడుతూ ఆదివాసి హక్కులు, చట్టాలు అమలుకై ఆదివాసి యువత సంఘటితంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. అలాగే ఈ సమావేశానికి హాజరైన పాండు కంటేకర్ మాట్లాడుతూ కోయ భాష, సాంస్కృతిక, సంప్రదాయాలు ఆదివాసీలకు గుర్తింపును ఇస్తాయని అన్నారు. ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు పూసం శ్రీను మాట్లాడుతూ ఆదివాసి పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని అన్నారు. అలాగే చదువుకున్న యువత నిరుద్యోగులు ఈ సిమినార్ లో నేర్చుకున్న విషయాలు గ్రామీణ స్థాయిలో తీసుకుని వెళ్లి ఆదివాసి పెద్దలకు వివరించి చట్టాలు అమలు కొరకు నిర్మాణాత్మకమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్ లో అరెం పాపారావు (లాయర్ ) 1/70 చట్టం , పేసా చట్టం, భారత రాజ్యాంగంలో ఐదవ, ఆరవ షెడ్యూల్ భూభాగంలో ఉన్న హక్కులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, కోయ భాష, సాంస్కృతిక - సంప్రదాయాలు మొదలగు చట్టాల గురించి కులంకుశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సోడే ముత్తయ్య, మినప నాగేశ్వరావు, పాయం లక్ష్మణరావు, ధర్మల రాంబాబు కారం కన్నారావు, మల్లం ఆనంద్, తెల్లం సురేష్, కుంజా శ్రీను, కూర నారాయణ, సోయం లక్ష్మణ్ రావు సోడే మురళి, ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు నూప అనిల్, టాప్ టెన్ టీం బాడిసే వెంకటేశ్వర్లు, తెల్లం నాగరాజు, తెల్లం నవీన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం

### ఎమ్మెల్యే బుచ్చియ్య చౌదరి




**రాజమహేంద్రవరం రూరల్, అక్టోబర్ 11(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఆంధ్ర రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి పోటీ పడుతున్న పారిశ్రామికవేత్తలు అంటూ శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధిని చూసి రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయిందని, మా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ మరువకుండా నెరవేరుస్తుంది గుర్తు చేశారు. వైయస్సార్ సిపి ప్రభుత్వంలో అభివృద్ధి మరచి లిక్కర్ స్కామ్ లతో ముందుకు సాగారని చెప్పారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప వైఎస్ఆర్సిపి మరి ఏమి చేయలేదు అని అప్పుడు చేసిన దుర్మార్గపు పనులను వైసీపీ చేసిన మోసాలను గుర్తు చేశారు. అందుకే ప్రజలందరూ కూటమి ప్రభుత్వం ముద్దు వైఎస్ఆర్సిపి వద్దు అంటూ తమ భావాలను వ్యక్తం చేస్తున్నారు అన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలోనూ కూటమి ప్రభుత్వం ముందడుగులో ఉంది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ అవగాహనతో పని చేస్తున్నారు అని తెలుగుదేశం, జనసేన, బిజెపి మధ్య చిచ్చు పెడుతున్న ఆవారా గాళ్లు జాగ్రత్తగా ఉండండి అన్నారు. వైఎస్ఆర్సిపిలో హత్య రాజకీయాలు చేసిన వాళ్ళు హీరోలు, మద్యం కుంభకోణంలో సెంటర్ జైలు నుండి వచ్చిన వాళ్ళు హీరోలు అవినీతిపరులు హీరోలు ఇది వైఎస్ఆర్సిపిలో ఉన్న పద్ధతి అన్నారు. కూటమి చేసే మంచి పనులకు అడ్డు వచ్చే ప్రతి ఒక్కరికి కూడా శిక్ష తప్పదని న్యాయబద్ధంగా శిక్ష ఉంటుందని ఎటువంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని అన్నారు.

## పోలవరంలో క్రీడా మైదానం ప్రారంభం





**పోలవరం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో క్రీడా మైదానంలో గత రెండు సంవత్సరములుగా క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేయకపోవడంతో ఈ సంవత్సరం క్రీడలు ప్రారంభించేందుకు చూడగా వర్షపునీరుతో గుంతలు పడి మొక్కలు వచ్చాయి. అడవిలా మారినా క్రీడా ప్రాంగణం ఉదయం పూట క్రీడాకారులు ఉద్యోగస్తులు వాకింగ్ చేయడానికి వచ్చేవారు. కానీ ఈ రెండు సంవత్సరములు దాన్ని అభివృద్ధి చేయకపోవడంతో క్రీడా మైదానం అడవిలా మారింది. విషయం తెలుసుకున్న పోలవరం ప్రాజెక్ట్ జీఎం గంగాధర్ మిషన్ పంపించి మైదానాన్ని శుభ్రం చేయించి ప్రాంగణాన్ని సరిచేశారు. ఈ కార్యక్రమాన్ని సహకరించిన మేనేజర్ దినేష్ కి యువత, పెద్దలు క్రీడాకారులు, ధన్యవాదాలు తెలిపారు.

## దళిత పోరాట యోధుడు కాన్సీరామ్

### ఘననివాళి అర్పించిన బీ.ఎస్.పి నాయకులు, కార్యకర్తలు



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 11(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్సిరామ్ వర్ధంతి సందర్భంగా ఘననివాళి అర్పించారు. బి ఎస్ పి పార్టీ సభ్యులు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ నుండే మనకు పోరాట ప్రతిమ వచ్చింది. గతంలో ఎంతో మంది దళితులను అంటరాని వారిగా చూసే సమయంలో ఒక్క క్కొక్కరికి ఎదురైనా అనుభవాలు బాధలను తెలిపారు. వీటిని మార్చాలి అంటే ప్రశ్నించే గోతుకు అయినా ఉండాలి లేదా ఎదురు తిరిగే సత్తా దైర్యం ఉండాలి అన్నారు. ప్రశ్నించేవారు టెర్రరిస్టు అన్నట్టు చూసే ఈ సమాజం ను మార్చాలని ప్రతి వ్యక్తికి తినడానికి తిండి, బట్ట ఉండేలా ప్రజల అందరి మధ్య కుల మత ద్వేష భావాలు లేకుండా చూడడమే పార్టీ లక్ష్యం అన్నారు. దళితులకు విద్యా, వైద్యం అందరికి అందాలి ఆలా జరిగితే దళితుల మధ్య ఇతరులకు ఉన్న బేధం తొలిగి పోతుంది అని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ పందొమ్మిదో వర్ధంతిని తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సంపదరావు, బహుజన్ వాది డాక్టర్ వెంకట రమణ, బీఎస్పీ జిల్లా ఇంచార్జి సత్యానందం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిర్రా రాజు, జిల్లా సెక్రటరీ నక్కా వెంకట రత్నరాజు, జిల్లా అడ్వైజర్ ఆనంద్ మాస్టర్, కొండపల్లి సూరిబాబు, కొత్తపల్లి శేఖర్, అబ్బులు, నెల్లి కళ్యాణ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ నిట్‌లో ముగిసిన టెక్రియా కార్యక్రమం

## అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్ర ప్రదేశ్ (ఏపీ నిట్)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్రియా 2కె25 కార్యక్రమం శనివారం రాత్రి ముగిసింది. ఉదయం విద్యార్థులు నిర్వహించిన పలు ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాటిలో కొన్ని ప్రదర్శనల వివరాలిలా ఉన్నాయి. ఈసిఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గైర్ మేజ్ ఛాలెంజ్ కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ఆటలో పాల్గొనే వ్యక్తి తన చేతికి గైర్ స్కోప్ ని అమర్చుకుని ఆడాల్సి ఉంటుంది. నిర్వాహకులు కారుకి, గైర్ స్కోప్ కి రెండింటికి ఎం.పి.యూ 6050, ఈఎస్పి 32ను ఏర్పాటుచేశారు. చేతికి అమర్చిన గైర్ స్కోప్ ను అటూ, ఇటూ తిప్పటం ద్వారా కారు ముందుకు, వెనుకకు వెళ్తోంది. ఇలా ఎదురుగా ఉన్న పలు అడ్డంకులను దాటుకుని నిర్ణీత సమయంలో గమ్య స్థానానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఎవరైతే ముందుగా వెళ్తారో వారిని విజేతలుగా ప్రకటిస్తారు. నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో ఏకో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొనే వారు రంగులతోగాని, ఆకులతోగాని నిర్వహకులు చెప్పిన మాదిరిగా బొమ్మలకు పెయింటింగ్ వేసి అందంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఎవరైతే అందంగా వేస్తారో వారే విజేత. అయితే నిర్వహకులు ముందుగానే కొన్ని రకాల పూలను వేడి చేసి రసాన్ని తీశారు. ఆ రంగులను మాత్రమే వినియోగించి బొమ్మలకు రంగులు వేయాల్సి ఉంటుంది. గ్రాఫిక్ కేఫ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మర్డర్ మిస్టరీ గేమ్ లో పాల్గొనే వారు తమ బుర్రకు పదును పెట్టాల్సి ఉంటుంది. ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. కానీ హత్యను ఎవరు, ఎందుకు చేశారో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోతుంది. అయితే ఘటనా స్థలంలో లభించిన కొన్ని ఆధారాల సహాయంతో మృతుడి బంధువుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టి హత్యకు పాల్పడిన నిందితులను పట్టుకోవాల్సి ఉంటుంది. ఈ ఆటలో ఐదు క్లూస్ ఉంటాయి. ఒక్కొక్క ఆధారాన్ని కనుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. ఐదో ఆధారం దొరికితేనే నిందితులు ఎవరనేది తెలుస్తుంది.

**అలరించిన నృత్యాలు**

టెక్రియా ముగింపు కార్యక్రమాల్లోబాగంగా రాత్రి నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు తమ ఆటపాటలతో చూపరులను మురిపించి మైమరిపించారు. హుసారైన సినీ గీతాలకు విద్యార్థులు నృత్యాలు చేస్తుండగా వేదిక ముందున్న విద్యార్థులు సైతం వారికి తోడుగా నృత్యాలు చేస్తూ, ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ, కేకలు వేస్తూ సందడి చేశారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు.








# కలిసికట్టుగా పని చేద్దాం

## ప్రభుత్వ విప్ నాయకర్



**నరసాపురం, అక్టోబర్ 12(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నరసాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యాలయంలో కొప్పరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోలిశెట్టి శేష, పోలిశెట్టి మధు, చిన్నమిల్లి బాబులు, అందే కవి ఆధ్వర్యంలో యాదంరెడ్డి సూరిబాబు, అందే భాస్కర రావు, కడలి ఏసుబాబు, గుబ్బల ఏడుకొండలు, కడలి ముత్యం జాయుడు, పీతల శాంసన్ సుమారు 200 మంది వైసీపీ శ్రేణులు జనసేన పార్టీలోకి చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్నా కండువాలు కప్పి సాదరంగాఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు ప్రసాద్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, మైల వసంతరావు, వాతాడి కనకరాజు, బందెల రవీంద్ర పోలిశెట్టి నళిని, అందే నరేన్, జనసేన నాయకులు జనసైనికులు, వీర మహిళ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నిమ్మల



**పాలకొల్లు, అక్టోబర్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మాజీ సీఎం జగన్ పెండింగ్ పెట్టిన ఫీజు బకాయిలను కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 1200 కోట్లు చెల్లించిందని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుకొస్తున్నారు మంత్రి నారా లోకేశ్. గత ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోగా వారిని గంజాయికి బానిసలుగా చేశాడు జగన్ అని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. హైటెక్ సిటిని నిర్మించి, ఉభయ తెలుగురాష్ట్రాల్లో పెద్ద ఎత్తున యువత ఐటి వైపు వెళ్ళేలా ప్రోత్సహించిన ఘనత చంద్రబాబుదే. సాఫ్ట్ వేర్ అంటే బెంగుళూరు, చెన్నై, పూణే మాత్రమే కాదు, సాఫ్ట్ వేర్ అంటే హైదరాబాద్ అనే విధంగా సైబరాబాద్ ను నిర్మించిన వ్యక్తి చంద్రబాబు. ఇప్పటికే పోలీస్ శాఖలో 6వేలకు పైగా, డిఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని మంత్రి నిమ్మల రామనాయుడు అన్నారు.

# కెఎస్ఆర్ రైస్ మిల్లును రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే బాలరాజు



**పోలవరం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** కొయ్యలగూడెం మండలం పొంగుటూరు గ్రామంలో కేఎస్ఆర్ రైస్ మిల్‌ను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించిన పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఇలాంటి యూనిట్లు దోహదపడతాయని, రైతులకు మంచి మద్దతు ధరలు లభించేలా పరిశ్రమలు ముందుకు రావాలని అన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఈ మిల్ ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, కూటమి పార్టీల మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, జిల్లా నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదివాసులారా.. అందరూ ఏకంకండి

## ఆదివాసి నాయకపోడు సేవ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ



**వి ఆర్ పురం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం విలేఖరి):** జీవో నంబర్ 3ని పునరుద్ధరణ చెయ్యాలని ఏజెన్సీలో 100 % ఉద్యోగ అవకాశాలు స్థానిక గిరిజనులకు ఇవ్వాలని ఈ నెల 13వ తేదీన చింతూరు ఐటీడీఏ ముట్టడి కార్యమానికి పిలుపునిచ్చిన ఆదివాసి నిరుద్యోగ యువతీ యువకులు ఈ యొక్క కార్యక్రమానికి ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం మద్దతు తెలిపారు. మండలం రేఖపల్లి గ్రామంలో ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం వి ఆర్ పురం మండలం ఆదివాసీ నాయకపోడు సంఘం సభ్యులు, గ్రామ పెద్దలతో ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ పత్రిక ప్రకటన విడుదల చేశారు. 13వ తారీఖున జరుగు ఐటీడీఏ ముట్టడి కార్యమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. 5 వ షెడ్యూల్ ఏరియాలో నూరు శాతం ఉద్యగా అవకాశాలు స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5వ షెడ్యూల్ ప్రాంతం లో రాజ్యాంగం లో కల్పించిన హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చెయ్యాలని ఏజెన్సీలో ఆదివాసులకు 100 % రిజర్వేషన్ కల్పిస్తూ ఉద్యగా ఉపాధ్యాయ నియామక చట్టం చెయ్యాలని కోరారు. మనల్ని పాలిస్తున్న ప్రభుత్వలు ఎన్నికల ముందు కళ్ళబొల్లి హామీలు ఇచ్చి గిరిజన హక్కులు కాపాడతమని చెప్పి అధికారంలోకి వచ్చాక గిరిజనులకు వారికీ ఇచ్చిన హామీలను వారు హక్కులను పట్టించుకోవటం లేదని, అటువంటి వారికి ఆదివాసులంతా ఒక్కటై సరైన బుద్ధి చెప్పాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బేతి సరయ్య, వెటకాని రాముడు, పిసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సారా పాండురాజు, వెటకాని సూరిబాబు, బేతి తిరుపతి రావు, కొట్టి ముత్యాలరావు, వెటకాని మల్లయ్య, వీర్ల శ్రీనివాసరావు, చింతకాయల భవాని శంకర్, బేతి సాయి, బేతి రాజు, గంగుల నాగేశ్వరావు, బేతి సత్యనారాయణ, పట్టీల లక్ష్మణ్ రావు, పట్టీల కార్తీక్, జమిలి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పరిశుభ్రతే ప్రజా ఆరోగ్యానికి మూలం!

## మలేరియా, డెంగూ నియంత్రణకు ముందస్తు చర్యలు.

## పెదబరడ పంచాయతీ సర్పంచ్ గోపాల్.



**చింతపల్లి, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** గ్రామ ప్రజల ఆరోగ్యం కాపాడాలంటే ప్రతి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని పెదబరడ గ్రామ పంచాయతీ సర్పంచ్ సమిడి గోపాల్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని చింతలూరు గ్రామంలో శనివారం మురుగు కాల్వల పూడికతీత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమల పెరుగుదలతో మలేరియా, డెంగూ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి గ్రామస్తుడు పరిశుభ్రత పట్ల జాగ్రత్తగా ఉండి స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామంలో మురుగు కాలువల పూడికతీతతో పాటు చెత్త తొలగింపు, రోడ్ల అంచుల శుభ్రపరచడం, మలిన జలాల సరిచేసే చర్యలు కూడా చేపట్టినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ చర్యలు ప్రజల్లో ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో పిసా కార్యదర్శి పాంగి సురేష్, కూటమి నాయకుడు గెమ్మెలి మహేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గ్రామంలో శుభ్రతా కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

# వయ్యారి మలుపుల బోడకొండమ్మ ఘాట్ రోడ్డు..!

## మలుపుల మాయలో మునిగిపోతున్న పర్యాటకులు.



**చింతపల్లి, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల పరిధిలోని బోడకొండమ్మ ఘాట్ రోడ్డు ప్రకృతి సోయగాలతో పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. వయ్యారి మలుపులు, పచ్చదనంతో కప్పుకున్న దట్టమైన అడవులు, పర్వతాల మధ్య సాగే ఈ యు%-%ఆకార రహదారి చూడగానే మనసును ఆకట్టుకుంటుంది. ఒక్కో మలుపు తిరుగుతున్న కొద్దీ కొత్త రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తూ ప్రకృతి ఒడిలో ఒక మధురానుభూతిని అందిస్తున్నాయి. వర్షాకాలం ప్రభావంతో రహదారి ఇరువైపులా చెట్లు, పొదలు మరింత నిండుదనాన్ని సంతరించుకున్నాయి. ఉదయం పొగమంచు కమ్ముకున్న వేళ పర్వతాల మధ్య సాగే ప్రయాణం ఆకాశాన్ని తాకే సాహస యాత్రలా అనిపిస్తోంది. బోడకొండమ్మ దేవాలయ దర్శనం కోసం వచ్చే భక్తులు తప్పనిసరిగా ఈ ఘాట్ రోడ్డు మీదుగా వెళ్తారు. అదే విధంగా లమ్మసింగి అందాలను ఆస్వాదించడానికి వచ్చే సందర్శకులు కూడా ఈ రహదారిలోని వంకర తిరుగుల మాయలో మునిగిపోతున్నారు. స్థానికులు చెబుతున్నదేమిటంటే బోడకొండమ్మ ఆలయం సమీపంలోని వ్యూ పాయింటు అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకపోకలు మరింత పెరుగుతాయని, ఘాట్ రోడ్డు పక్కన వీక్షణ స్థలాలు, విశ్రాంతి కేంద్రములు ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత సౌలభ్యం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

# ఓట్ చోర్ - గద్ది చోడ్ పోస్టర్ ఆవిష్కరణ

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లీలా



**వి ఆర్ పురం, అక్టోబర్ 11 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్.షర్మిల రెడ్డి అల్లూరి సీతారామరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు శతక బుల్లిబాబు ఆదేశాల మేరకు "ఓట్ చోర్ గద్ది చోడ్" పోస్టర్ ఆవిష్కరణ విఆర్ పురం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండిమేని లీలకృష్ణ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారత దేశ ప్రతిపక్ష నేత, ప్రియతమ నాయకులు రాహుల్ గాంధీ, బీజేపీ పార్టీ అక్రమంగా ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగిస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉద్యమించాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. దీనికి మద్దతుగా సెప్టెంబర్ 15వ తేది నుండి అక్టోబర్ 15వ తేది వరకూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతుంది. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దీనిలో భాగం అయ్యి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బీజేపీ పార్టీ యొక్క అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మండల నాయకులు కడుపు సత్యనారాయణ (క్రాంతి), సయ్యద్ సర్వరాజు, కుంజా రమేష్, మడకం జనయ్య, తెలం సాయిబాబు, కారం దేవరాజు, కుంజా గాంధీ, దుర్గరావు, మడకం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# జంగు పట్టిన జలజీవన్ మిషన్ పథకం..!

- పైపులు వేశారు నీరు ఇవ్వడం మరిచారు...?
- చింతపల్లి మండలంలోని అంతర్ల గ్రామంలో నీటి బోర్డు నిర్లక్ష్యం బహిర్గతం.
- రూ.15 లక్షల నిధులు వృథా-గిరిజనుల ఆగ్రహం.






**చింతపల్లి, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** గిరిజన ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాన్ని నీటి సరఫరా శాఖ నిర్లక్ష్యం నీరుగార్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి సమీపంలోని అంతర్ల గ్రామం మెట్టపై మూడు సంవత్సరాల క్రితం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.15 లక్షల నిధులు కేటాయించి రెండు రక్షిత త్రాగునీటి ట్యాంకుల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇంటింటికి కోళాయిల ద్వారా నీరు అందించాలన్న ప్రణాళికతో పనులు ప్రారంభమైనా, సగం దాకా వచ్చి ఆగిపోయాయి. దీంతో గ్రామస్థులు ఇప్పటికీ చల్లటి నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా మరియు పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఈ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో పైపులు తుప్పుపట్టి పగుళ్లు పడ్డాయి. ఇంటింటికీ కొళాయిలు అమర్చే పనులు కూడా ప్రారంభించకుండానే గుత్తేదారుడు మాయమవ్వడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం రేపింది.





**గ్రామస్తుల వేదన.**

ప్రతి ఇంటికి కొళాయి వస్తుందన్న అధికారుల మాటలు నమ్మి మేమంతా ఆనందించాం. కానీ ఇప్పుడు మూడు ఏళ్లుగా ఒక్క చుక్క నీరు ఇంటికి వస్తే ఒట్టు... అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా అడగడానికి రావడం లేదుని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతర్ల మెట్టపై నిర్మించిన రెండు రక్షిత నీటి ట్యాంకులు ఇప్పుడు పాడుబడిపోయాయి. అంతర్ల కాలనీ, అంతర్ల కొత్త వీధి, పెద్ద పైపు వీధి ప్రజలు ఇప్పటికీ పాత బోర్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. వేసవిలో బోర్లు ఎండిపోతే కిలోమీటర్ల దూరంలోని ఊట గడ్డల దగ్గరికి వెళ్లి నీరు తెచ్చుకోవడం వారి దైనందిన బాధగా మారింది.

**నిధుల వినియోగంపై ప్రశ్నలు.**

జలజీవన్ మిషన్ కింద కేటాయించిన రూ.15 లక్షల నిధులు ఎలా వినియోగించారన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. లెక్కల్లో మాత్రం నిధులు ఖర్చయినట్లు చూపిస్తున్నారు, కానీ నీటి సరఫరా మాత్రం శూన్యం. ఈ నిధులు ఎవరి చేతుల్లోకి వెళ్లాయో తేల్చాలని స్థానిక ప్రజలు అధికారులకు డిమాండ్ చేస్తున్నారు.

**నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు.**

గిరిజన సంక్షేమ నిధులతో చేపట్టిన రక్షిత నీటి పథకం ఇంతకాలం పూర్తి కాకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు, కాంట్రాక్టర్లు బాధ్యతారాహిత్యంతో వ్యవహరించడంతో ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం గండిపడిందని వారు ఆరోపిస్తున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చించిన నిధులు ఇలా వృథా అవుతుంటే ప్రభుత్వం కళ్లెందుకు మూసుకుంటుందని గ్రామస్తులు ఆగ్రహంగా ప్రశ్నిస్తున్నారు.

**ప్రజల డిమాండ్.**

అంతర్ల గ్రామస్థులు ఈ పథకాన్ని పునఃసమీక్షించి, మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తదితర అధికారులను కోరుతున్నారు. నీటి సమస్య పరిష్కారమైతేనే మన జీవనం సులభమవుతుందని అంతర్ల, అంతర్ల కొత్త వీధి, పెద్ద పైపు గ్రామస్తులు వాపోతున్నారు.

## బాలికల సాధికారతతోనే భారతదేశ భవిష్యత్తు!

**చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు.**







**చింతపల్లి, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** బాలికల సాధికారత, మహిళల ఆరోగ్యం, విద్యాభివృద్ధి భారతదేశ భవిష్యత్తుకు రక్షణ కవచాలు అని చింతపల్లి ఎస్సై వి. వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అనే థీమ్‌తో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లి అనుబంధం, ఆడపిల్ల అణకువ, కుటుంబాల మధ్య సేతగా నిలిచేది స్త్రీ మాత్రమే. సృష్టికి మూలమైన ఆడబిడ్డను కంటికి రెప్పలా కాపాడాలి. చిన్న వయసులో బాల్యవివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తును దెబ్బతీస్తాయి. తల్లిదండ్రులు బాలికలు చదువులో ముందుకు సాగేందుకు ప్రోత్సాహం ఇవ్వాలని పిలుపునిచ్చారు. బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం, తమ లక్ష్యాలను సాధించడం అత్యంత అవసరమని సూచించారు. బాలికలు ధైర్యంగా, విద్యలో ముందుండి సమాజ మార్పుకు దారి చూపాలని అన్నారు. కార్యక్రమాన్ని వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం డైరెక్టర్ సునీత రాణి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి బాలికను సమాన హక్కులతో గౌరవించాల్సిన సమయం ఇది. మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో చింతపల్లి, చౌడుపల్లి, కొత్తపాలెం, అన్నవరం, లోతుగడ్డ, తమ్మెంగుల, పెదబరడ పంచాయతీలకు చెందిన కిషోర బాలికలు, మహిళా మండలి సభ్యులు, స్థానిక మహిళా శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. బాలికలలో ఆత్మవిశ్వాసం పెంపొందించే నినాదాలతో సభామండపం మారుమోగింది. కార్యక్రమం చివర్లో మహిళా మండలి సభ్యులు బాలికల రక్షణ, విద్యాభివృద్ధి, ఆరోగ్యంపై ప్రతిజ్ఞ చేశారు.

## ఇల్లు, మెకానిక్ షెడ్‌పై కూలిన టేకు చెట్టు

**తొలగింపులో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం.**

విద్యుత్ శాఖ కదలకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం
వెంటనే తొలగించాలంటూ డిమాండ్.
మెకానిక్ షెడ్ యజమాని రాజు, ఇంటి యజమాని అచ్యుత్ రామయ్య.



**చింతపల్లి, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే ప్రమాదకర పరిస్థితి నెలకొన్నా విద్యుత్ శాఖ అధికారులు నిద్రలేవడం లేదు. చింతపల్లి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల ఎదురుగా ఉన్న మెకానిక్ పంచదారల రాజు షెడ్‌పై, పక్కనే నివసిస్తున్న ఇండుగ అచ్యుత్ రామయ్య ఇంటిపై గత ఆగస్టు 18న భారీ టేకు చెట్టు కూలిపోయింది. అప్పటి నుండి చెట్టు అక్కడే పడిఉండడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ పరిధిలోకి వచ్చే ఈ చెట్టును తొలగించాలంటూ బాధితులు, స్థానికులు పలుమార్లు అధికారులను కోరినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చెట్టు మా షెడ్‌పై పడిపోవడంతో వర్క్‌షాప్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇంటి గోడలు చీలిపోతున్నాయి. వర్షం పడితే కరెంట్ షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని పంచదారల రాజు, అచ్యుత్ రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖను సంప్రదించగా ఈ చెట్టు విద్యుత్ శాఖ పరిధిలో ఉంది. వారు అధికారిక విజ్ఞప్తి చేస్తేనే మేము తొలగించగలం అని అధికారులు సమాధానమిచ్చారని తెలిపారు. మరోవైపు విద్యుత్ శాఖ అధికారులు మాత్రం బాధ్యతను అటవీ శాఖపై నెట్టివేస్తుండటంతో బాధితులు తీవ్రంగా మండిపడ్డారు. స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే ఇలాంటి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నా అధికారులు స్పందించడం లేదు. చెట్టు ఎప్పుడు పూర్తిగా కూలిపోతుందో తెలియదు. ప్రాణనష్టం జరిగితేనే చర్యలు తీసుకుంటారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ, అటవీ శాఖ, మండల పరిపాలన అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని చెట్టును తొలగించకపోతే పెద్ద ప్రమాదం తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## వివో ఏ ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన యూనియన్**
**వివోఏ అభినందన సభలో సిఐటియు నేతలు**



**ఏలూరు జిల్లా /కుక్కునూరు అక్టోబర్ 11 :తెలుగు రాష్ట్రం**

వివోఏ ల 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ అభయన్స్లో పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం పట్ల సిఐటియు హర్షం వ్యక్తం చేసిందని, గత ఆరేళ్లగా సిఐటియు అనుబంధ సంఘమైన ఏపీ వెలుగు వివో ఏ ఉద్యోగుల సంఘం చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ఈ నిర్ణయం చేసిందని వి.ఓ.ఏ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి, సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో సున్నం వెంకటలక్ష్మి అధ్యక్షతన వివోఏ యూనియన్ అభినందనలు సభ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సుభాషిని సాయికిరణ్ మాట్లాడుతూ, వైయస్సార్సీపి ప్రభుత్వం 2019లో ఈ సర్కులర్ ని తీసుకొచ్చిందని దీని రద్దు కోసం రాష్ట్రంలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహించామని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. మెడ మీద కత్తిలా వేలాడుతున్న కాల పరిమితి సర్క్యులర్ రద్దు కోసం మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడితో సహా దశల వారి పోరాటాలు నిర్వహించామని తెలియజేశారు. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సర్క్యులర్ను రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటన చేశారు. వి ఓ ఏలు చేస్తున్న పోరాటాలకు మద్దతునిచ్చి తమ ప్రభుత్వం అధికారంలో కి వచ్చాక సర్క్యులర్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారనీ తెలియజేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయంగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ని స్వయంగా కలిసి వినత పత్రాలు అందించామని వినతిని నేడు నెరవేర్చారని అన్నారు. సర్కులర్ రద్దు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సభలో వివో ఏ యూనియన్ కార్యదర్శి కుర్రగ్రేసి, వివోఏలు మేడవరపు రమాదేవి, మాధవి, నాగలక్ష్మి, రాజ్ కుమారి, కీర్తన, దీప్తి, యేసుకుమారి, మాధవి, వెంకటలక్ష్మి, గంగ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## మందేశ్వర స్వామి దేవస్థానంలో తైలాభిషేకం

**భక్తుల విరాళాలతో రూ.1.48 లక్షల ఆదాయం**



**కొత్తపేట, అక్టోబర్ 11( తెలుగు రాష్ట్రం )**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం భక్తిశ్రద్ధలతో తైలాభిషేకములు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి సేవలో భాగంగా విరాళాలు సమర్పించారు. తైలాభిషేకముల ద్వారా రూ.1,24,155/-లు, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.24,176/-లు అందగా, మొత్తం ఆదాయం రూ.1,48,331/-గా నమోదైనట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ వివరాలను దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు వెల్లడించారు.

## సవరించిన జిఎస్టి ధరలను అమలు చేయాలి

**కొత్తపేటలో టిడిపి గ్రామ సమావేశం**



**కొత్తపేట, అక్టోబర్ 11 :( తెలుగు రాష్ట్రం)**

కొత్తపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సమావేశం శనివారం జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ వైఫల్యాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. సభ్యులు మాట్లాడుతూ "సవరించిన జిఎస్టి ధరలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఉపశమనం కలిగే చర్యలు తీసుకోవాలని" డిమాండ్ చేశారు. సమావేశంలో తల్లికి వందనం పథకం కింద విద్యుత్ బిల్లుల్లో ఉన్న లోపాల కారణంగా పథకం నిలిచిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు సవరించి అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని కోరారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులందరికీ సహాయం అందించాలన్నారు. అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదు లక్షల ఆదాయం పేరుతో నిలిపివేసిన దేవాలయ ట్రస్టు బోర్డులను పునరుద్ధరించి, ఆ దేవాలయాలకు సింగిల్ ట్రస్టీలను నియమించాలని కోరారు. కొత్తపేటలో మండల రెవెన్యూ కార్యాలయాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొత్త హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని, అన్న క్యాంటీన్‌ను త్వరితగతిన ప్రారంభించాలని తీర్మానించారు. పుష్కరాల సందర్భంగా దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కూడా కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కర్‌రావు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, సీనియర్ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి యల్లమిల్లి జగన్మోహనరావు, మండల ప్రధాన కార్యదర్శి కదలి భీమేశ్వరరావు, గ్రామ ప్రధాన కార్యదర్శి ఎలిశెట్టి ప్రభాకర్, చిలకమర్తి శ్రీనివాస్, తమ్మన సాయిప్రసాద్, దూనబోయిన ప్రదీప్, శ్రీకాకోళపు గోపాలకృష్ణ, కముజు తాతాజీ, బయ్యే రాంబాబు, బండి రాజు, కముజు శ్రీనివాసరావు, బూసి విష్ణుమూర్తి, సీతారామరాజు, శీలం సూర్యచంద్రరావు, డి. నాగేంద్ర, చింతపల్లి కృష్ణ, సూరవరపు భూషణం, ములగలేటి బంగారం, నక్కా విజయ్, చోడపనీడి రాంబాబు, దూనబోయిన నారాయణ, బూత్ కన్వీనర్లు, పంచాయతీ సభ్యులు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాలికలే దేశ భవిష్యత్తు - విద్యతో వెలుగొందాలి!

**చింతపల్లి, అక్టోబర్ 11 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా లమ్మసింగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్వైజర్ డి.జె. భారతి ప్రధాన అతిథిగా హాజరై, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సింహాచలం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ బాలిక ఒక కుటుంబానికి అద్దం, సమాజానికి ఆధారం. బాల్యవివాహాలు బాలికల జీవితాలను చీకటిలోకి నెడతాయి. చిన్న వయసులో వివాహం జరగడం వల్ల విద్య ఆగిపోతుంది, ఆరోగ్యం దెబ్బతింటుంది, భవిష్యత్తు బలహీనమవుతుందని వివరించారు. బాలికలు తమ ప్రతిభను చాటుకునేందుకు విద్యే ప్రధాన సాధనమని, చదువు ద్వారా ఆర్థిక స్వతంత్రతతో పాటు సమాజంలో గౌరవప్రతిష్టలు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. విద్యతో కూడిన విలువలు, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యం సాధ్యమే. అందుకే ప్రతి బాలిక విద్యను ఆయుధంగా ఎంచుకోవాలని ప్రేరణాత్మకంగా చెప్పారు. బాలికల హక్కులు, రక్షణ, ఆరోగ్యం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో, నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. కుమారి, బి. భవాని పాల్గొన్నారు.





తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
అక్టోబర్ 12,
ఆదివారం 2025


# రెండ్రోజుల్లో వెస్టిండీస్‌ను ఉతికారేసిన టీమిండియా బ్యాట్స్‌మెన్

## తొలి ఇన్నింగ్స్‌లో 518 రన్స్‌కు డిక్లేర్

**వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకోవడంతో, టీమిండియా తొలి ఇన్నింగ్స్‌ను 5 వికెట్ల నష్టానికి 518 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ సెంచరీతో అదరగొట్టగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అజేయ శతకంతో జట్టుకు భారీ స్కోరు అందించాడు.**



టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు ఓపెనర్లు కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ మంచి ఆరంభాన్ని ఇచ్చారు. తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించిన తర్వాత కేఎల్ రాహుల్ (38) ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్ తో జతకలిసిన జైస్వాల్, సెంచరీ పార్టనర్ షిప్ నెలకొల్పారు. సాయి సుదర్శన్ అద్భుతంగా ఆడి 87 పరుగుల వద్ద అవుట్ అవగా, జైస్వాల్ పట్టుదలగా ఆడి తొలి రోజు ఆట ముగిసే సమయానికి 173 పరుగులతో అజేయంగా నిలిచాడు. తొలి రోజు ఆటలో టీమిండియా 2 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది.

రెండో రోజు ఆట ప్రారంభంలోనే యశస్వి జైస్వాల్ (175) రనౌట్ రూపంలో నిరాశపరిచాడు. అయితే, జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన జోరును కొనసాగించాడు. గిల్ 196 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్లతో అజేయంగా 128 పరుగులు చేసి భారీ స్కోరును అందించాడు. గిల్‌కు తోడుగా నితీష్ కుమార్ రెడ్డి 43 పరుగులు చేసి సహకరించగా, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ 44 పరుగులు చేసి ఔటయ్యాడు.

ధ్రువ్ జురెల్ ఔట్ అయిన వెంటనే టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను 5 వికెట్ల నష్టానికి 518 పరుగుల వద్ద డిక్లేర్ చేశాడు. ఈ భారీ స్కోరు సాధించడంలో గిల్ సెంచరీ కీలక పాత్ర పోషించింది.

రెండో టెస్టు మ్యాచ్ కోసం భారత్, వెస్టిండీస్ జట్ల ప్లేయింగ్ ఎలెవన్ ఇదే

### భారత ప్లేయింగ్ ఎలెవన్:

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

### వెస్టిండీస్ ప్లేయింగ్ ఎలెవన్:

జాన్ క్యాంప్‌బెల్, తేజ్‌నరైన్ చంద్రపాల్, అలిక్ అథానార్ఝ్, షై హెూప్, రోస్టన్ చేజ్ (కెప్టెన్), టెవిన్ ఇమ్లాచ్ (వికెట్ కీపర్), జస్టిన్ గ్రీవ్స్, జోమెల్ వారికన్, ఖారి పియెర్, ఆండర్సన్ ఫిలిప్, జేడన్ సీల్స్.

# శుభ్‌మన్ గిల్ చేసిన తప్పుతో యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీ మిస్..

## మ్యాచ్ మధ్యలో ఇద్దరి మధ్య వాగ్వాదం

**భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీ కల చెదిరిపోయింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జైస్వాల్, రెండో రోజు ఆట మొదలైన కొద్దిసేపటికే దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. ఈ రనౌట్‌కు కారణం తోటి బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్తో ఏర్పడిన మిస్ అండర్ స్టాండింగ్. కేవలం 173 పరుగుల వద్ద తన ఇన్నింగ్స్‌ను ముగించిన జైస్వాల్, డబుల్ సెంచరీకి అతి చేరువలో నిరాశతో వెనుదిరిగాడు.**





వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ రెండో రోజు ఆటలో టీమిండియాకు పెద్ద షాక్ తగిలింది. మొదటి రోజు అంతా అద్భుతంగా బ్యాటింగ్ చేసి 173 పరుగుల వద్ద నాటౌట్‌గా ఉన్న యశస్వి జైస్వాల్, రెండో రోజు ఆట మొదలైన వెంటనే రనౌట్ రూపంలో వెనుదిరిగాడు. జైస్వాల్ మిడ్-ఆఫ్ దిశగా బలంగా షాట్ కొట్టి, వేగంగా పరుగు కోసం సగం పిచ్ దాటి వచ్చాడు. నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్, అతన్ని ఆగిపోవాలని సైగ చేశాడు. వెనక్కి మళ్లే ప్రయత్నం చేసేలోపే ఫీల్డర్ విసిరిన త్రో నేరుగా వికెట్లను తాకడంతో జైస్వాల్ ఔట్ అయ్యాడు.

ఈ అనూహ్య రనౌట్ తర్వాత జైస్వాల్ ముఖంలో తీవ్ర నిరాశ కనిపించింది. పెవిలియన్ వైపు వెళ్లే సమయంలో కెమెరాలకు చిక్కిన దృశ్యాలలో ఇద్దరు బ్యాట్స్‌మెన్ల మధ్య వాగ్వాదం జరిగినట్లు కనిపించింది. అతను 253 బంతుల్లో 22 ఫోర్లతో 173 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో సంయమనం పాటించిన జైస్వాల్, బంతి పాతబడే కొద్దీ తన స్ట్రైక్ రేట్‌ను పెంచాడు. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేయగా, ఆ తర్వాత కేవలం 63 బంతుల్లోనే తదుపరి 50 పరుగులను పూర్తి చేయడం విశేషం.

150 పరుగుల మార్కును దాటిన తర్వాత అతను డబుల్ సెంచరీ వైపు దూసుకెళ్తున్నాడు. దీనిపై మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే మ్యాచ్‌కు ముందు మాట్లాడుతూ.. జైస్వాల్‌కు పెద్ద ఇన్నింగ్స్ ఆడే ఆకలి, మ్యాచ్‌ను ఒక్కడే మార్చగల సామర్థ్యం ఉందని ప్రశంసించారు. ఈ మ్యాచ్‌లో అతను ట్రిపుల్ సెంచరీ కొట్టే అవకాశం ఉందని కూడా అంచనా వేశారు.. కానీ ఒక తప్పుడు నిర్ణయం ఆ అవకాశాన్ని దూరం చేసింది. రనౌట్ రూపంలో ఇన్నింగ్స్ ఆగిపోయినప్పటికీ, యశస్వి జైస్వాల్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడని ఈ ప్రదర్శన రుజువు చేసింది. అతని టెక్నిక్, ఓర్పు, దూకుడు అన్నింటి కలయిక అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ మ్యాచ్‌లో అతను 173 పరుగులు చేసిన తీరు చూస్తే, భవిష్యత్తులో అతను అనేక పెద్ద రికార్డులను తన పేరిట లిఖించుకునే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 6,6,6,6,4,4,4,4.. టెస్ట్‌లో టీ20 బ్యాటింగ్..

## 21 బంతుల్లోనే ప్రపంచ రికార్డ్




**టెస్ట్ క్రికెట్‌లో ఒక క్రూరమైన బ్యాట్స్‌మన్ విధ్వంసం సృష్టించాడు, ప్రత్యర్థి జట్టు బౌలర్లు దయ కోసం వేడుకున్నాడు. తన క్రూరమైన బ్యాటింగ్‌తో, ఈ విస్ఫోటక బ్యాట్స్‌మన్ టెస్ట్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీగా ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.**

టెస్ట్ క్రికెట్‌లో, డేంజరస్ బ్యాటర్ టీ20 తుఫానులా విధ్వంసం సృష్టించాడు. దీంతో ప్రత్యర్థి జట్టు బౌలర్లు ఓ దశలో కన్నీళ్లు పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ విధ్వంసక బ్యాట్స్‌మన్, తన డేంజరస్ బ్యాటింగ్‌తో, టెస్ట్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించిన ప్రపంచ రికార్డును సృష్టించాడు. ఈ సమయంలో, ఈ బ్యాట్స్‌మన్ 6,6,6,4,4,4,4 కొట్టాడు. ఈ విధ్వంసక బ్యాట్స్‌మన్ తన హాఫ్ సెంచరీలో 40 పరుగులు ఫోర్లు, సిక్సర్ల ద్వారా సాధించడం గమనార్హం. 21 బంతుల్లో టెస్ట్ క్రికెట్‌లో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీని సాధించడం ద్వారా, ఈ బ్యాట్స్‌మన్ అతిపెద్ద అద్భుతాన్ని సాధించాడు.

### టెస్ట్‌లలో విధ్వంసం..

ఈ బ్యాట్స్‌మన్ టెస్ట్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీతో ప్రపంచ రికార్డు సృష్టించాడు. కేవలం 21 బంతుల్లోనే సాధించాడు. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీగా నిలిచింది. ఈ ప్రపంచ రికార్డును నెలకొల్పిన బ్యాట్స్‌మన్ మరెవరో కాదు, పాకిస్తాన్ మాజీ కెప్టెన్ మిస్బా-ఉల్-హక్. నవంబర్ 2, 2014న, ఆస్ట్రేలియాతో జరిగిన అబుదాబి మైదానంలో, మిస్బా-ఉల్-హక్ రెండవ టెస్ట్ మ్యాచ్ నాల్గవ రోజున 21 బంతులు కొట్టి, వేగవంతమైన అర్ధ సెంచరీగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. మిస్బా-ఉల్-హక్ ఆస్ట్రేలియన్ బౌలర్లను చిత్తు చేస్తూ, తన అర్ధ సెంచరీకి చేరుకునే మార్గంలో 4 భారీ సిక్సర్లు, 4 ఫోర్లు కొట్టాడు.

గతంలో జాక్వెస్ కల్లిస్ 2005లో జింబాబ్వేపై 24 బంతుల్లోనే అత్యంత వేగవంతమైన టెస్ట్ అర్ధ సెంచరీ సాధించిన ప్రపంచ రికార్డును సృష్టించాడు. తొమ్మిది సంవత్సరాల తర్వాత మిస్బా-ఉల్-హక్ తన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు.

### 57 బంతుల్లో 101 పరుగులు చేసి నాటౌట్‌గా..

నవంబర్ 2, 2014న, ఆస్ట్రేలియాతో జరిగిన అబుదాబి మైదానంలో, మిస్బా-ఉల్-హక్ రెండవ టెస్ట్ మ్యాచ్ నాల్గవ రోజు రెండవ ఇన్నింగ్స్‌లో 57 బంతుల్లో అజేయంగా 101 పరుగులు చేశాడు. 177.19 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన మిస్బా-ఉల్-హక్ 11 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఉమ్మడిగా రెండవ వేగవంతమైన సెంచరీ కూడా. దీనికి ముందు, వెస్టిండీస్ గొప్ప బ్యాట్స్‌మన్ వివ్ రిచర్డ్స్ 1986లో ఇంగ్లాండ్‌పై 57 బంతుల్లో సెంచరీ చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో వేగవంతమైన సెంచరీ సాధించిన ప్రపంచ రికార్డు న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ పేరు మీద ఉంది. బ్రెండన్ మెకల్లమ్ 2016లో ఆస్ట్రేలియాపై 57 బంతుల్లో సెంచరీ చేశాడు.

# గిల్‌కు అప్పుడదే చెప్పాం.. కోచ్‌గా ఆ ఓటమిని ఎన్నటికీ మర్చిపోలేను: గంభీర్

భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లను అందించాడు. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను డ్రాగా ముగించాడు. కానీ, కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో వరుసగా ఓటములను చవిచూశాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌ను కోల్పోవడాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని గౌతమ్ గంభీర్ తెలిపాడు. వెస్టిండీస్‌తో రెండో టెస్టు సందర్భంగా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో గంభీర్ మాట్లాడాడు. ఆ వీడియోను విండీస్‌తో రెండో టెస్టు రెండో రోజు లంచ్ బ్రేక్ సమయంలో క్రీడా ఛానల్ ప్రసారం చేసింది. "ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా మారాలనుకుంటే.. కేవలం స్వదేశంలో గెలిస్తేనే సరిపోదు. విదేశాల్లోనూ సత్తా చాటడం అత్యంత ముఖ్యం. ఇప్పుడీ యువ జట్టు చూపించే తెగువ అదే. ఇంగ్లాండ్ జట్టు మనకు అత్యంత కఠినమైన సవాల్ విసిరే టీమ్. అక్కడికి పెద్దగా అనుభవం లేని జట్టుతో వెళ్లాం. అద్భుతమైన ప్రదర్శనతో తిరిగి వచ్చాం. ఇక్కడ కేవలం రిజల్ట్స్‌ను మాత్రమే చూడకూడదు. ఎలాంటి పోరాటం చేశామనేది అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే కేవలం స్వదేశంలోనే గెలిస్తేనే సరిపోతుందని నేను భావించను. ఇక్కడే విజయాలు సాధిస్తే వరల్డ్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలవలేరు" అని గంభీర్ తెలిపాడు. "నా కోచింగ్ కెరీర్ ముగిసినా సరే.. జీవితాంతం న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను మరిచిపోలేను. ఇదే విషయాన్ని మా కుర్రాళ్లకూ చెప్పా. దానిని వదిలేసి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అలాగే గతాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అలా చేయకపోతే దేనినైనా తేలికగా తీసుకొనే అవకాశం ఉంటుంది. క్రీడల్లో ఇవన్నీ సహజమే. ప్రతి ఒక్కరూ ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే ఉంటారు. నేను డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా ఆటగాళ్లకు ఎప్పుడూ న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో ఏం జరిగిందో చెబుతూ ఉంటా. ప్రత్యర్థికి ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకూడదనేది నా భావన" అని గంభీర్ వ్యాఖ్యానించాడు. "యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తా. అతడిని 25 ఏళ్ల వయసులోనే టెస్టు సారథిగా చేసినప్పుడు ఒకటే చెప్పాం. 'మేం నిన్ను లోతైన సముద్రంలోకి నెట్టాం. రెండే మార్గాలు ఉంటాయి.

# రనౌట్‌తో డబుల్ సెంచరీ మిస్.. కట్‌చేస్తే.. చెత్త రికార్డులో జైస్వాల్.. అదేంటంటే?

**ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరుగుతోన్న రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఢిల్లీ టెస్ట్ రెండో రోజు తొలి సెషన్‌లో యశస్వి జైస్వాల్ రనౌట్ అయి పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. 92వ ఓవర్ రెండో బంతికి, వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ వేసిన ఫుల్-లెంగ్త్ డెలివరీని యశస్వి జైస్వాల్ మిడ్-ఆఫ్ వైపు బలంగా డ్రైవ్ చేశాడు.**



యశస్వి జైస్వాల్ వెంటనే పరుగు తీయడానికి పరుగెత్తడం ప్రారంభించాడు. కానీ, శుభ్‌మన్ గిల్ ఆసక్తి చూపలేదు. జైస్వాల్ అప్పటికే చాలా ముందుకు కదిలాడు. ఆ తర్వాత క్రీజులోకి తిరిగి రావడానికి ప్రయత్నించాడు. కానీ, చాలా ఆలస్యం అయింది. ఆ త్రో కీపర్ ఎండ్‌లో పడింది. టెవిన్ ఇమ్లాచ్ స్టంప్‌లను చెల్లాచెదురుగా చేశాడు. రనౌట్ అయిన తర్వాత, జైస్వాల్ మరొక ఎండ్‌లో ఉన్న కెప్టెన్‌పై కొంత అసంతృప్తి చెందాడు. జైస్వాల్ 258 బంతుల్లో 22 ఫోర్లతో సహా 175 పరుగులు చేసి పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసి రనౌట్ అయిన నాల్గవ బ్యాట్స్‌మన్‌గా యశస్వి జైస్వాల్ నిలిచాడు. ఈ అవాంఛిత జాబితాలో 1989లో పాకిస్తాన్‌తో జరిగిన లాహోర్ టెస్ట్‌లో 218 పరుగుల వద్ద రనౌట్ అయిన సంజయ్ మంజ్రేకర్ అగ్రస్థానంలో ఉన్నాడు. 2002లో ది ఓవల్‌లో ఇంగ్లాండ్‌పై 217 పరుగుల వద్ద రనౌట్ అయిన రాహుల్ ద్రవిడ్ ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. 2001లో కోల్‌కతా టెస్ట్‌లో ఆస్ట్రేలియాపై 180 పరుగులకు రనౌట్ అయిన రాహుల్ ద్రవిడ్ కూడా ఈ జాబితాలో మూడవ స్థానంలో ఉన్నాడు.

### టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక స్కోరు వద్ద రనౌట్ అయిన టీమిండియా ప్లేయర్లు..

218 పరుగులు - సంజయ్ మంజ్రేకర్ - పాకిస్థాన్‌పై (లాహోర్ 1989)
217 పరుగులు - రాహుల్ ద్రవిడ్ - ఇంగ్లాండ్ పై (ది ఓవల్ 2002)
180 పరుగులు - రాహుల్ ద్రవిడ్ - ఆస్ట్రేలియాపై (కోల్‌కతా 2001)
175 పరుగులు - యశస్వి జైస్వాల్ - వెస్టిండీస్‌పై (ఢిల్లీ 2025)
155 పరుగులు - విజయ్ హజారే - ఇంగ్లాండ్ పై (ముంబై 1951)
144 పరుగులు - రాహుల్ ద్రవిడ్ - శ్రీలంకపై (కాన్పూర్ 2009).

# డిజిటల్ రంగంలోకి హృతిక్‌రోషన్



బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ డిజిటల్ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. ప్రైమ్ వీడియోతో చేతులు కలిపి ఆయన ఓ కొత్త థ్రిల్లర్ సిరీస్‌ను నిర్మించబోతున్నారని బాలీవుడ్ వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి. 'స్ట్రోమ్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ వెబ్ సిరీస్‌కు 'టబ్బర్' ఫేమ్ డైరెక్టర్ అజిత్ పాల్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సబా అజాద్, మలయాళ నటి పార్వతి తిరువోతు, అలయా ఎఫ్, శ్రీష్టి శ్రీవాస్తవ, రమా శర్మ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించబోతున్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఆర్‌ఎక్స్ ఫిలిమ్స్ ద్వారా, ఫిల్మ్‌క్రాఫ్ట్ ఫిలిమ్స్ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలను చిత్రబృందం త్వరలో తెలపనుంది.

# ఇలాంటి ట్రయాంగిల్ లవ్‌స్టోరీ చూసి ఉండరు

'మిరాయ్' లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తరువాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్-ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రాశి ఖన్నా శనివారం మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఇప్పటివరకు చాలా ట్రయాంగిల్ లవ్ స్టోరీస్ చూశాం. కానీ ఇందులో ఒక యూనిక్ పాయింట్ ఉంది. ఆ పాయింట్ ఏంటి అనేది మీరు థియేటర్స్‌లోనే చూడాలి (నవ్వుతూ). దర్శకురాలు నీరజ ఈ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. అంత యూనిక్ స్క్రిప్ట్ ఎలా రాయగలిగారనిపించింది. అలాగే ఈ సినిమా షుటింగ్‌లో చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. అలాంటి సర్‌ప్రైజ్‌ని ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. ఈ సినిమా చూసిన తర్వాత లవ్, బౌండరీస్ గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారు.

ఇలాంటి పాయింట్‌తో వచ్చిన సినిమాని నేను చూడలేదు. నీరజ ప్రతి క్యారెక్టర్‌ని అద్భుతంగా రాసింది. చాలా లేయర్స్ ఉన్నాయి. ఇందులో మూడు పాత్రలు చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. ఆ మూడు పాత్రలు బ్యాలెన్స్ చేయడం చాలా టఫ్. ఇందులో అంజలి పాత్రలో కనిపిస్తాను. నా రియల్ లైఫ్‌కి ఆ పాత్రకు ఏ మాత్రం పోలికలు లేవు. సిద్దు ఆన్ సెట్‌లో క్రాఫ్ట్ మీద చాలా సీరియస్‌గా ఉంటారు. తనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్. శీనిధి, నా కాంబినేషన్‌లో చాలా మంచి సీన్స్ ఉన్నాయి. అవన్నీ మీకు బాగా నచ్చుతాయి. తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. చాలా ప్యాషన్‌తో వర్క్ చేస్తారు. 'మల్లిక గంధ' పెద్ద హిట్ అయ్యింది. పాటలన్నీ చాలా అద్భుతంగా వచ్చాయి. నిర్మాత విశ్వ ప్రసాద్‌తో 'వెంకీ మామ' చేశాను. ఇది సెకండ్ ఫిల్మ్. చాలా ప్యాషన్ ఉన్న ప్రొడ్యూసర్. సినిమాకి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు.

పవన్ కళ్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్ సింగ్' చేస్తున్నా. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. ఆయన ఫాలోయింగ్, ఒరా నెక్స్ట్ లెవల్. అలాగే హిందీలో నాలుగు ప్రాజెక్ట్స్ చేస్తున్నాను. నాకు మైథలాజికల్ సినిమాలు ఇష్టం. అలాగే హర్రర్ బ్యాక్‌డ్రాప్ ఉన్న కథలు కూడా ఇష్టమే. అవకాశం వస్తే కచ్చితంగా నటిస్తా.

**హీరోయిన్ రాశిఖన్నా**



# పక్కా యాక్షన్ థ్రిల్లర్ 'కాటాలన్'



పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ 'మార్కో' తరువాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, షరీఫ్ మహమ్మద్ నుంచి మరో భారీ ప్రాజెక్ట్‌గా 'కాటాలన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ చిత్రంలో హీరోగా అంటోని వర్గీస్ పెపే మాస్ అవతార్‌లో కనిపిస్తున్నారు. మంటల చుట్టూ, సిగరెట్‌తో, కళ్లలో జ్వాలలతో కనిపిస్తున్న ఆయన లుక్‌తోపాటు రక్తంతో తడిసిన ముఖం, చేతులు చూపిస్తున్న యాక్షన్ ఇన్‌టెన్సిటీతో సినిమాపై అందరిలోనూ రేకెత్తిస్తోంది. నూతన దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా గ్రాండ్ పూజా కార్యక్రమాలలో ప్రారంభమైంది. పాన్-ఇండియా కాన్సెప్ట్‌గా భారీ స్థాయిలో నిర్మిస్తునారు. థాయ్ లాండ్ యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఒంగ్-బాక్ సిరీస్ యాక్షన్ డైరెక్టర్ కెచా ఖాంఫక్డీ తన టీమ్‌తో కలిసి రూపొందించారు. అదే సిరీస్‌లో నటించిన పాంగ్ కూడా ఈ సినిమాలో కనిపించనుంది. ఇందులో సునీల్, కబీర్ దుహాన్ సింగ్ (మార్కో), రాపర్ బేబీ జీన్, రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్), బాలీవుడ్ నటుడు పార్థ్ తివారి (కిల్ ఫేమ్), అలాగే మలయాళ సినీ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్-సింగర్ హనాన్ షా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లేను జోబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జేకబ్ సంయుక్తంగా రాశారు. డైలాగ్స్‌ను ఉన్నీ ఆర్. రాశారు. ఈ సినిమా మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ %-% జుమాన్ షెరీఫ్, సినిమాటోగ్రఫీ %-% రెనదివ్, సంగీతం %-% బి. అజనీష్ లోక్‌నాథ్, ఎడిటింగ్ %-% షమీర్ మహమ్మద్, స్టంట్స్- కేచా ఖంఫక్డీ, యాక్షన్ సంతోష్, ప్రొడక్షన్ డిజైన్ %-% సునీల్ దాస్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ %-% దీపిల్ దేవ్, ప్రొడక్షన్ కంట్రోలర్ %-% దీపక్ పరమేశ్వరన్, ఆడియోగ్రఫీ %-% రాజాకృష్ణన్, సౌండ్ డిజైన్ %-% కిషన్, సప్త రికార్డ్స్, కాస్ట్యూమ్ డిజైన్ %-% ధన్య బాలకృష్ణన్, సాహిత్యం %-% సుహైల్ కోయా, కొరియోగ్రఫీ %-% షరీఫ్.

# 7న 'ప్రేమిస్తున్నా' విడుదల

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జోడీగా నటించిన తాజా చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వరలక్ష్మీ పప్పుల సమర్పిస్తున్నారు. కనకదుర్గారావు పప్పుల నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమా నుంచి 'సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నా' వీడియోను నిర్మాతలు విడుదల చేశారు. 56 సెకెన్ల నిడివి ఉన్న ఈ విడియోలో సినిమా ఎలా ఉండబోతోందో చెప్పే ప్రయత్నం చేశారు. ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'ఇప్పటివరకు తెలుగులో అంత అన్ కండీషనల్ లవ్‌తో ఏ సినిమా రాలేదు. అద్భుతమైన పాటలు, పర్ఫార్మెన్‌సతో ఈ చిత్రం నవంబర్ 7న థియేటర్లలో విడుదల కానుంది. చాలా కాలం తర్వాత వస్తోన్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఈ సినిమా. మేము విడుదల చేసిన సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నాకు అన్ని తరగతుల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది' అని దర్శకుడు వర్గాల ఆడియన్స్ నుండి సూపర్బ్ రెస్పాన్స్ లభిస్తోందని' దర్శకుడు భాను అన్నారు.




# ప్రధాని మోదీని కలిసిన రామ్ చరణ్, ఉపాసన...

**ఆర్చరీ లీగ్‌పై ప్రత్యేక చర్చ**
**కొత్తగా ప్రారంభించిన ఆర్చరీ లీగ్ విజయంపై చర్చ**
**విలువిద్యను దేశవ్యాప్తంగా ప్రోత్సహించడమే లక్ష్యం**
**లీగ్‌లో ఆరు రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి**
**భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్**



టాలీవుడ్ అగ్రహీరో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఆయన అర్ధాంగి ఉపాసన కొణిదెల శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇటీవల తాను ప్రారంభించిన ఆర్చరీ (విలువిద్య) లీగ్ విజయవంతమైన నేపథ్యంలో ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ సమావేశంలో, భారతదేశంలో విలువిద్యకు పూర్వ వైభవం తీసుకువచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ఆర్చరీ లీగ్ గురించి ప్రధాని మోదీకి వివరించినట్లు తెలుస్తోంది. దేశంలో ఈ క్రీడను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడం, యువతను ప్రోత్సహించడం వంటి అంశాలపై వీరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ప్రధానితో చరణ్, ఉపాసన దంపతులు ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతున్న దృశ్యాలు ఫొటోలలో కనిపించాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ధనుస్సు చేతబట్టారు. భారత్‌లో ఐపీఎల్, ప్రో కబడ్డీ లీగ్‌ల తరహాలోనే విలువిద్య కోసం ప్రత్యేకంగా 2025లో తొలిసారిగా ఆర్చరీ లీగ్‌ను ఢిల్లీలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ, తమిళనాడు, ఝార?ండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్ సహా మొత్తం ఆరు రాష్ట్రాల జట్లు పోటీపడ్డాయి. దేశీయ క్రీడలను ప్రోత్సహించేందుకు రామ్ చరణ్ ముందుకు రావడం, ఈ లీగ్‌కు విశేష ఆదరణ లభించడం గమనార్హం. ఈ లీగ్ విజయం గురించి ప్రధాని దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఈ క్రీడకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని పలువురు భావిస్తున్నారు.

# కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాం..



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ 22'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా. మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారు' అని అట్లీ తెలిపారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339